ప్రజాశక్తి

సోమవారం 9 డిసెంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

సర్దుపోటు

- ఎఫ్‌పిపిసిఎలతో పెరిగిన విద్యుత్ ఛార్జీలు
- తగ్గిస్తామంటూనే 'కూటమి' ప్రభుత్వం మోత

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, కశింకోట, బుచ్చెయ్యపేట విలేకరులు

బుచ్చెయ్యపేటకు చెందిన గొల్లవిల్లి రాము (సర్వీస్ నెంబరు 115634బి 005000692) ఇంటికి అక్టోబర్‌లో 101 యూనిట్లకు రూ.492 బిల్లు వచ్చింది. అందులో 101 యూనిట్లకు రూ.384.77 బిల్లురాగా, రూ.108 ఇతర ఛార్జీల కింద వేశారు. ఇదే సర్వీసు నెంబర్ ఇంటికి నవంబరులో వినియోగించిన 81 యూనిట్లకు రూ.257.37 బిల్లు రాగా, వివిధ ఛార్జీల కింద 136.63 బిల్లు వేయడంతో వెరసి రూ.394 బిల్లు వచ్చింది. అక్టోబర్‌లో ఒక ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ వేయగా, నవంబరు బిల్లులో మరొక ఎఫ్‌పిపిసిఎ ఛార్జీ వేశారు. రెండు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు వేయడంతో కరెంట్ ఛార్జీ భారం రాము వలె జిల్లాలోని దాదాపు ఏడు లక్షల మంది గృహ విద్యుత్ వినియోగదారులపై పెరిగింది.

విద్యుత్ ఛార్జీలు పెంచబోమని ఎన్నికల్లో మాటిచ్చి.. అధికారం చేతికొచ్చాక వైసిపి ప్రభుత్వం వలే వినియోగదారులపై కూటమి ప్రభుత్వం సర్దుబాటు ఛార్జీల భారం మోపింది. ఇంధన, సర్దుబాటు ఛార్జీల భారం లేకుండా రద్దు చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవే ఛార్జీలు పెంచి వినియోగదారుల నెత్తిన భారం వేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్న పేద, మధ్య తరగతి ప్రజలకు విద్యుత్ ఛార్జీల మోత మూలిగే నక్కపై తాడిపండు పడినట్లయింది. వినియోగ విద్యుత్ యూనిట్ ధర పెంచకుండా, గతంలో వాడిన విద్యుత్‌పై సర్దుబాటు ఛార్జీల పేరుతో ఇప్పుడు వసూలుచేసి మిగతా 2లో..



ENERGY CHRG	384.77
FIXED CHRG	10.00
CUST CHRG	45.00
ED	6.06
SURCHARGES	0.00
ED INT	0.16
TRUEUP CHRG	0.00
FPPCA CHRG	0.00
FPPCA2 CHRG	46.00
SHORTFALL	0.00
ACD SURCHRG	0.00
FAN INSTAL	0.00
ADJ AMOUNT	0.00
LOSS/GAIN	0.01
BILL AMOUNT	492.00
GOVT SUBSIDY	76.00
BILL AFT SUB	416.00
ISD-TDS :	0.00

గొల్లపల్లి రాము అక్టోబర్ బిల్లులో నమోదైన ఒక ఎఫ్‌పిపిసిఎ ఛార్జి

ENERGY CHRG	257.37
FIXED CHRG	10.00
CUST CHRG	45.00
ED	4.86
SURCHARGES	0.00
ED INT	0.16
TRUEUP CHRG	0.00
FPPCA CHRG	32.91
FPPCA2 CHRG	44.00
SHORTFALL	0.00
ACD SURCHRG	0.00
FAN INSTAL	0.00
ADJ AMOUNT	0.00
LOSS/GAIN	-0.30
BILL AMOUNT	394.00
GOVT SUBSIDY	38.00
BILL AFT SUB	356.00
ISD-TDS :	0.00

గొల్లపల్లి రాము నవంబర్ బిల్లులో నమోదైన రెండు ఎఫ్‌పిపిసిఎ ఛార్జీలు

ఆరిలోవ పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభంలో హోం మంత్రి అనిత, డిజిపి ద్వారకా తిరుమలరావు

మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

ఆరిలోవ పోలీస్ స్టేషన్ భవనం ప్రారంభంలో హోం మంత్రి అనిత

ప్రజాశక్తి - ఆరిలోవ : రాష్ట్రంలో పోలీసు శాఖలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కృషి చేస్తామని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. హనుమంతువాక వద్దగల విమ్స్ ఆసుపత్రి వద్ద రూ 2.5 కోట్ల నిధులతో 17 గదులతో విశాలమైన ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని డిజిపి సిహెచ్.ద్వారకా తిరుమలరావులతో కలిసి ఆదివారం ఉదయం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖలో అత్యంత దయనీయ స్థితిలో ఉన్న పోలీస్ స్టేషన్ ఏదైనా ఉందంటే అది ఆరిలోవ పోలీస్ స్టేషన్ మాత్రమేనన్నారు. పోలీస్ శాఖను తిరిగి జీరో నుంచి ప్రారంభిస్తామన్నారు. తాజా భవనంలో ఎసిపి కార్యాలయం నిర్మాణం కోసం అదనపు అంతస్తు నిర్మాణానికి మరో రూ 2.5 కోట్ల నిధులు మంజూరు విషయమై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఆరిలోవ నూతన పోలీస్ స్టేషన్ కోసం పోలీస్ శాఖ వెల్ఫేర్ ఫండ్ నుంచి రూ 40 లక్షలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. అదేవిధంగా నూతన భవనం ఫర్నీచర్ కోసం సిఎస్ఆర్ నిధుల్లో రూ 16 లక్షలను విరాళంగా ఇచ్చిన దివీస్ లేబొరేటరీ యాజమాన్యాన్ని అభినందించారు. తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ మిగతా 2లో..

విశాఖలో మూడు చోట్ల ఇసుక నిల్వ కేంద్రాలు

వార్త 2లో..

అన్నదాతకు చినుకు భయం

వార్త 7లో..

ముగిసిన అఖిల భారత రవాణా సంస్థల క్రీడా పోటీలు

వార్త 3లో..

రహదారుల అభివృద్ధికి కృషి

'ప్రజాశక్తి'తో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్

ప్రజాశక్తి - అనకాపల్లి : జిల్లాలో రహదారుల అభివృద్ధికి శాఖాపరంగా కృషి చేస్తున్నట్లు ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి హెచ్ ఎన్ ఆర్ ఎన్ వి. రమేష్ వెల్లడించారు. ఇటీవల ఆయన్ని కలిసిన 'ప్రజాశక్తి'తో పలు విషయాలు ముచ్చటించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

అనకాపల్లి జిల్లాలో రహదారుల పరిస్థితిని వివరించండి ?

అనకాపల్లి జిల్లాలో 1402 కిలోమీటర్లు మేర రోడ్డు పనులు చేపడుతున్నాం. అందులో స్టేట్ హైవే రోడ్లు 357 కిలోమీటర్లు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 809 కిలోమీటర్లు, అదర్ డిస్ట్రిక్ట్ రోడ్లు 235 కిలోమీటర్లు ఉన్నాయి. వాటిలో 69కి అర్జెంటు రోడ్డు రిపేర్లు చేపడుతున్నాం. రూ.5 కోట్లు ఖర్చు చేయనున్నాం.

ఆ పనులకు టెండర్లు పిలిచారా ?

69 రోడ్డు పనుల్లో 13 పనులకు టెండర్లు పిలిచాం. మిగిలిన వాటికి లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్సీ ఇచ్చారు. జనవరి 15కు పూర్తి చేయాల్సి ఉంది.

ప్యాచ్ వర్క్‌ల పరిస్థితి ఏంటి ?

అనకాపల్లి - నర్సీపట్నం మధ్య 56 కిలోమీటర్లు, వడ్డాది - పాడేరు మధ్య 14 కిలో మీటర్లు, నర్సీపట్నం - రేవు పోలవరం మధ్య 10 కిలోమీటర్లు, సింహాచలం - పినగాడి మధ్య ఏడు కిలోమీటర్లు, శొంఠ్యాం రోడ్డు నాలుగు కిలోమీటర్లు మొత్తం మిగతా 2లో..

డెయిరీ అక్రమాలపై తొలి అడుగు

- నేడు సభా సంఘం రాక
- చాలా కాలంగా పాల రైతుల సొమ్ము పరులపాలు
- అంతులేని అవినీతి కథ
- మిల్క్, ఫైనాన్స్ ఆడిట్‌తో బయటకు రానున్న బండారం
- కలెక్టరేట్లలో ఫిర్యాదులు స్వీకరించాలంటున్న రైతులు

విశాఖ డెయిరీ ప్రధాన కార్యాలయ ముఖద్వారం (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖ డెయిరీ అవినీతి, అక్రమాలపై విచారణకు నియమించిన సభా సంఘం సోమవారం తొలిసారి డెయిరీని సందర్శించనుంది. సంఘం ఛైర్మన్, సీనియర్ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, సభ్యులుగా నియమితులైన ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, బొండా ఉమామహేశ్వరరావు, గౌతు శిరీష, ఆర్‌విఎస్‌కె.రంగారావు, దాట్ల సుబ్బరాజు ఉదయం 10.30 గంటలకు డెయిరీకి రానున్నారు. ఇక్కడ పరిశీలించిన తరువాత మధ్యాహ్నం 3 గంటలకు విశాఖపట్నం కలెక్టరేట్‌లో సమావేశం కానున్నారు. రెండు నెలల్లో నివేదిక సమర్పించాల్సివున్నందున తదుపరి విచారణపై చర్చించనున్నారు.

గతంలో వలె కాకుండా, సహకార రంగం నుంచి కంపెనీ యాక్టు కిందకు డెయిరీని తీసుకురావడానికిగల కారణాలతో పాటు ఆ క్రమంలో జరిగిన ఉల్లంఘనలు, ప్రస్తుతం డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనందకుమార్ సహా పాలకవర్గం కూర్పు, పాల సేకరణ, రైతులకు డబ్బుల చెల్లింపు, పాల ఉత్పత్తుల తయారీ, అమ్మకం, ఆ డబ్బులు బ్యాంకు ఖాతాలో జమ, ఖర్చులు, రైతులు, ఉద్యోగుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన మిల్క్ ప్రొడ్యూసర్స్ అండ్ ఎంప్లాయీస్ ఎడ్యుకేషన్, హెల్త్ అండ్ మెడికల్ వెల్ఫేర్ ట్రస్ట్ (ఎంపిఅండ్ఇఇహెచ్అండ్ఎండబ్ల్యు)కు వచ్చే ఆదాయం, దాని సేవలు, సంక్షేమం, వివిధ కార్యక్రమాలకు చేస్తున్న ఖర్చులపై మిల్క్, ఫైనాన్స్ ఆడిట్ నిర్వహిస్తే మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

సర్దుపోటు

ప్రభుత్వం అతి తెలివి ప్రదర్శిస్తోంది. ఇంధనం, విద్యుత్ కొనుగోలు ఖర్చు సర్దుబాటు (ఎఫ్‌పిపిసిఎ) ఛార్జీలు వసూలు చేసుకొనేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపిఇఆర్‌సి) అనుమతివ్వడంతో నవంబరు కరెంట్ బిల్లులు వినియోగదారులకు షాకిస్తున్నాయి. బిల్లులో ప్రభుత్వం చెల్లిస్తున్న నామమాత్రపు సబ్సిడీ కంటే వేసిన భారం ఎక్కువగా వుంది.

విద్యుత్ ఛార్జీలు పెంచబోమంటూనే ఇతర పద్ధతుల్లో ఛార్జీలు పెంచి వసూలుచేసిన గత ప్రభుత్వ మార్గంలోనే కూటమి ప్రభుత్వం ప్రయాణం సాగుతోంది. కేటగిరి, వినియోగం ఆధారంగా పెంచిన సర్దుబాటు ఛార్జీలతో ఎక్కువ మంది వినియోగదారులపై కనీసంగా వంద రూపాయల అదనపు భారం పడింది. కొంతమందికి మూడు నుంచి ఐదు వందల రూపాయలు అదనంగా విద్యుత్ బిల్లులు వచ్చాయి. రోజుకు వంద రూపాయల ఆదాయంరాని పాన్ షాపులకు నెలకు వంద రూపాయలకుపైగా భారం పడింది. జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) అనకాపల్లి సర్కిల్ పరిధిలోని కశింకోట మండలం తాళ్లపాలెంలో ఎల్‌టి కేటగిరి-2లో పాన్‌షాపు పెట్టుకొని నడుపుతున్న వినియోగదారునికి (సర్వీస్ నెంబరు 1174745501000068) 24 యూనిట్లకు రూ.270.80 కరెంట్ బిల్ వచ్చింది. గురునాధ పేరున వున్న ఈ సర్వీసుకు వినియోగించిన 24 యూనిట్ల విద్యుత్‌కు రూ.129లు వచ్చింది. ఫిక్స్‌డ్ ఛార్జీ రూ.75, కస్టమర్ ఛార్జీ రూ.30, ఎలక్ట్రిసిటీ డ్యూటీ రూ.24, ఎఫ్‌పిపిసిఎ-2 ఛార్జీ రూ.12 వెరసి రూ.141 అయింది. గురునాధ పాన్‌షాపునకు వచ్చిన రూ.270.80 కరెంట్ బిల్లులో విద్యుత్ బిల్లు (రూ.129) కంటే ఇతర పద్ధతుల్లో వసూలు చేసిన ఛార్జీలే (రూ.141) ఎక్కువుగా ఉన్నాయి. కశింకోటలో డి.వెంకయ్య ఇంటి (సర్వీస్ నెంబరు 1171671101000557)కి 90 యూనిట్ల విద్యుత్ వినియోగంపై రూ.314 బిల్లు పడింది. వివిధ ఛార్జీల కింద వేసిన రూ.102తో కలిపి రూ.417 కరెంట్ బిల్లు రావడంతో గతుక్కుమన్నాడు.

మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

పోలీస్ స్టేషన్‌కు వచ్చే రహదారి, బ్రిడ్జి నిర్మాణానికి జివిఎంసి నిధులు రూ.కోటి మంజూరుకు కమిషనర్‌తో మాట్లాడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, డిఐజి గోపీనాథ్ జెట్టి, సిపి శంఖబ్రత బాగ్చీ, డిసిపి - 1 అజిత్ వేజెండ్ల, ఎసిపి అన్నెపు నరసింహ మూర్తి, ఆరిలోవ సిఐ మల్లేశ్వరరావు, వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పలువురికి సత్కారం

ఆరిలోవ పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం కోసం కృషి చేసిన పలువురిని ఈ సందర్భంగా మంత్రి ఘనంగా సత్కరించారు. ఆరిలోవ పోలీస్ స్టేషన్ నూతన భవనానికి విమ్స్ ఆసుపత్రిలో 1.08 ఎకరాల స్థలం ఇవ్వడంలో సహకరించిన విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబును ఆమె అభినందించారు.

రహదారుల అభివృద్ధికి కృషి

91 కిలోమీటర్ల ప్యాచ్ వర్క్‌లకు న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆర్థిక సహకారం అందించింది. రూ.220 కోట్లతో పనులు ప్రారంభించాల్సి ఉంది. కొన్నిచోట్ల టెండర్లు పిలిచే పని జరిగింది. పేమెంట్లు రాకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా పనులు ఆగాయి. టెండరుదారులు బడ్జెట్ రివైజ్ చేయాలంటున్నారు. డిఫరెన్స్ అమౌంట్ ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది.

డెయిరీ అక్రమాలపై తొలి అడుగు

వాస్తవ సమాచారం తెలియనుంది.

ఈ అక్రమాల్లో ఎవరి పాత్ర, భాగస్వామ్యం ఎంతనేది తేలనుంది. ప్రధాన సూత్రధారులూ బయటపడనున్నారు. ఎంతకాలం నుంచి పాల రైతుల సొమ్ము సొంతానికి వాడుకొని లబ్ధిపొందుతున్నారో, ఎప్పటి నుంచి ఎవరెవరు ఎలా ఆస్తులు కూడబెట్టుకున్నారో నిగ్గుతేలాలంటే నిష్ణాతులైన నిజాయతీకలిగిన వారి తోడ్పాటు సభా సంఘం తీసుకోవాల్సివుంది. రికార్డుల నిర్వహణలో ఆరితేరిన ఛైర్మన్, అందుకు సహకరిస్తున్న డెయిరీ ఎమ్‌డి, సహచర గణం నిధుల దుర్వినియోగం తేలాలంటే పదిహేనేళ్లుగా పాల సేకరణ, పాల పదార్థాల తయారీ, అమ్మకం, నిధుల జమ, ట్రస్టు కార్యకలాపాలపై సభా సంఘం ఆడిట్ నిర్వహించాల్సివుంది. రికార్డులోని జమ, ఖర్చుల పరిశీలనకు పరిమితం కాకుండా, నిధుల ఖర్చు, దాని వాస్తవి విలువ, ప్రయోజనాలపై క్షేత్రస్థాయిలో లోతుగా పరిశీలించాలని రైతులు కోరుతున్నారు.

బోనస్‌ను సొసైటీలకు జమచేసి, తిరిగి ఆ డబ్బును సేవా కార్యక్రమాల నిమిత్తం ట్రస్టుకు మళ్లించే ఏర్పాటు చేసుకొని, సొంతానికి ఆ డబ్బులు ఛైర్మన్ వినియోగించుకున్నారన్న బలమైన అభియోగాలున్నాయి. అయితే, ఎక్కడా తమ అవినీతి, నిధుల దుర్వినియోగం బయటపడకుండా రికార్డులు నిర్వహిస్తున్నారన్న విమర్శలున్నాయి. డెయిరీ సొమ్ముతో రైతుల కోసం ఏర్పాటుచేసిన కృషి ఆస్పత్రిని కిమ్స్ ఆస్పత్రికి లీజుకు ఇవ్వడం, లీజు డబ్బులు ట్రస్ట్‌కు చేస్తున్న జమపైనా పరిశీలించాల్సివుంది. తాను, తన కుటుంబ సభ్యులు కొందరు లాభపడుతూనే, తనను ఏనాడూ ప్రశ్నించకుండా డైరెక్టర్లను మచ్చిక చేసుకున్నారన్న విమర్శలున్నాయి. అందుకు ప్రతిఫలంగా డైరెక్టర్లను డిస్ట్రిబ్యూటర్లుగా నమోదుచేసి పైసా పెట్టుబడి లేకుండా నెలకు కనీసంగా కమీషన్ రూపంలో ఐదు లక్షల ఆదాయం వచ్చే మార్గం వారికి చూపించారన్న ఆరోపణలు ఎంతోకాలంగా వున్నాయి. డెయిరీ జీతం తీసుకుంటున్న 108 ఉద్యోగులను ఛైర్మన్, డైరెక్టర్లు తమ సొంత పనులకు వినియోగించుకోవడం, కావాల్సిన ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చి అందలమెక్కించడం, ప్రశ్నించే వారిని, నచ్చనివారిని బదిలీ చేయడం, ఇబ్బందులకు గురిజేయడం వంటివి కొనసాగుతున్నాయి.

డెయిరీ అవినీతి, అక్రమ వ్యవహారాలపై లిఖితపూర్వకంగా ఆధారాలతో సహా ఇచ్చే ఫిర్యాదుల స్వీకరణకు విశాఖపట్నం, అనకాపల్లి, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లా సహా ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టరేట్లలో ప్రత్యేక కేంద్రాలను సభా సంఘం ఏర్పాటుచేస్తే అత్యధిక మంది వినియోగించుకొనే అవకాశముంది.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని సీతమ్మధారకు చెందిన 'నాట్యం' నాట్య కళాక్షేత్ర మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ 24వ వార్షికోత్సవం పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియంలో అంగరంగ వైభంగా జరిగింది. నిర్వాహకులు, సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ కె.మాధవి, నాట్యం నిర్వాహకులు వెంకట్ ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు చక్కటి తర్ఫీదునిచ్చి 'నాట్యాంజలి' పేరిట ఏర్పాటు చేసిన భరతనాట్య బృంద ప్రదర్శనలు అలరించాయి. వరంగల్లుకు చెందిన సుప్రసిద్ధ కూచిపూడి, భరతనాట్య నిపుణులు బి.సుధీర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంపటి చినసత్యం కూచిపూడి కళాక్షేత్ర ప్రిన్సిపల్ హరి రామ మూర్తి, ద డ్యాన్స్ ఇండియా ఆంగ్ల మాసపత్రిక సంపాదకులు బత్తినరంగ విక్రమ్ కుమార్ (గౌడ్), సాంస్కృతికరంగ ప్రముఖులు కన్నం వెంకట రమణరావు, ఉమ్మిడి మహేష్ బాబు పాల్గొన్నారు. సీతా శ్రీనివాస్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో భాగంగా సంస్థలో సంగీత, నృత్య శిక్షణ పొందినవారిలో 2023-24 విద్యా సంవత్సరానికిగాను అగ్రశ్రేణిలో నిలిచిన కొందరిని ఎంపిక చేసి సత్కరించారు. తెలుగు ఇండియన్ ఐడల్ పోటీలో రన్నరప్‌గా నిలిచిన జీవీ శ్రీ కీర్తికి గానగంధర్వ పురస్కారమందించారు.

నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్న కళాకారులు

విశాఖలో మూడు చోట్ల ఇసుక నిల్వ కేంద్రాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ జిల్లాలో మూడు చోట్ల ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. జిల్లాలో ఇసుక రీచ్‌లు లేనందున ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి ఇసుక కమిటీ ప్రజల అవసరాలు తీర్చేందుకు భీమిలి, ముడసర్లోవ ప్రాంతాలలో ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఇసుక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. ఇసుక నిల్వ కేంద్రం నుండి వినియోగదారులకు సోమవారం నుంచి ఇసుక సరఫరా ప్రారంభం కానుందన్నారు. భీమిలి ఇసుక నిల్వ కేంద్రం వద్ద నిర్ణయించిన అమ్మకపు ధర టన్నుకు రూ.700గా ఉందని, ఇసుక నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జ్ 9398002019, 7989715157 నెంబర్లలో అందుబాటులో ఉంటారని, ముడసర్లోవ ఇసుక నిల్వ కేంద్రం వద్ద నిర్ణయించిన అమ్మకపు ధర రూ.700కాగా, ఇసుక నిల్వ కేంద్రం ఇన్‌ఛార్జ్ 8309186417, 6300805838 నెంబర్లలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

ఇసుక కావలసిన వినియోగదారులు తమ వివరాలను sand.ap.gov.inలో నమోదు చేసుకొని, రిజిస్ట్రేషన్ కాపీని తీసుకొని ఇసుక నిల్వ కేంద్రం వద్దకు వెళ్లాలని, లేదా ఇసుక నిల్వ కేంద్రం వద్దకు తమ ఆధార్ కార్డును తీసుకుని వెళ్లి అక్కడ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

సమాజాభివృద్ధిలో జర్నలిస్టులు కీలకం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : సమాజాభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర కీలకమని విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎం.ప్రణవ్ గోపాల్ అన్నారు. ఎపి వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్ అసోసియేషన్, ఎపి స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ విశాఖ యూనిట్ల ఆధ్వర్యంలో ఆదివారం శివాజీ పార్క్ యోగా కేంద్రంలో వన సమారాధన కార్యక్రమం చేపట్టారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో అండగా ఉంటుందన్నారు. పాత్రికేయులకు ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. విఎంఆర్‌డిఎ సందర్శనీయ ప్రాంతాల్లో పాత్రికేయుల పిల్లలకు ఉచితంగా ప్రవేశం కల్పించే విషయమై కమిషనర్‌తో త్వరలో మాట్లాడతానన్నారు. గౌరవ అతిథిగా హాజరైన స్థితప్రజ్ఞ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ వైవివి.సత్య నారాయణ మాట్లాడుతూ జర్నలిస్టులతోనే సమాజ ప్రగతి సాధ్యమన్నారు. సభకు అధ్యక్షత వహించిన జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, విశాఖ నగర అధ్యక్షులు పి.నారాయణ, కార్యదర్శి జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతిఏటా దసరా, దీపావళి, సంక్రాంతి, ఉగాది వంటి ముఖ్యమైన పండగలతో పాటు వనసమారాధన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు.

మౌనిక పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అంబరాన్ని తాకాయి. కార్యక్రమంలో బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, కార్యదర్శి కె.మదన్, స్మాల్ అండ్ మీడియం పేపర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వివిఎస్.జగన్మోహన్, కార్యదర్శి కె.శ్రీనివాసరావు. గాజువాక, భీమిలి, పద్మనాభం, మధురవాడ, గాజువాక, గోపాలపట్నం జర్నలిస్టులు, వారి కుటుంబీకులు 550 మంది పాల్గొన్నారు.

గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం విశాఖపట్నం బ్రాంచి గుర్తింపు ఎన్నికల నోటిఫికేషన్ ఆదివారం సాయంత్రం విడుదలైంది. ప్రొఫెసర్ డాక్టర్ వివిఎస్.ప్రసాద్, కిముడు రామారావు, బాక సత్యారావు, ప్రొఫెసర్ డాక్టర్ కుడుముల వెంకటరమణమూర్తి, శోభ వెంకటరాజు నోటిఫికేషన్ విడుదల చేసిన వారిలో ఉన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకూ నామినేషన్లను స్వీకరించనున్నారు. 12న నామినేషన్ పత్రాల పరిశీలన ఉంటుంది. 14న నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. అదే రోజు గుర్తులు, నామినేషన్లు ఖరారైన తర్వాత పోటీలో ఉన్న ప్యానల్‌కు ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి ఇవ్వనున్నారు. 22న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకూ ఓటింగ్ ప్రక్రియ ఉంటుంది. లెక్కింపు, ఫలితాలు అదే రోజున ఉంటాయి.

వైభవంగా క్యుఎంబి చర్చి వజ్రోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రేసపువానిపాలెంలోని క్యుఎంబి చర్చి వజ్రోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు ఐజక్ మాట్లాడుతూ 1948 నుంచి నేటి వరకూ సంఘ పరిచర్యలు దినదిన ప్రవర్థమానం చెందడంలో సహాయ సహకారాలందించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కాటపల్లి ఇజ్రాయిల్, రెవరెండ్ డాక్టర్ జి.స్టీవెన్ పీటర్, పాస్టర్ చార్లీ మోజెస్, భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

'రుషికొండ'ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని రుషికొండ ప్యాలెస్‌ను రాష్ట్ర మ్యూజియంగా మార్చాలని బుద్ధిస్ట్ మాన్యుమెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు జనసేన జిల్లా అధ్యక్షులు, దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.మల్లయ్య రాజు, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి వెంకటరమణ మాట్లాడుతూ విశాఖ జిల్లా బౌద్ధ చారిత్రక వారసత్వం కలిగిన ప్రాంతమని, జైన మతం ఆనవాళ్లు కూడా ఈ ప్రాంతంలో అనేకం ఉన్నాయని తెలిపారు. తొట్లకొండ, బొజ్జన్నకొండ, బావికొండలతో పాటు శ్రీకాకుళం దాటి పొరుగు రాష్ట్రాల వరకు ఈ సంస్కృతి, సంప్రదాయాలు ప్రాప్తి చెంది ఉన్నాయని పేర్కొన్నారు. పరిశోధనల నేపథ్యంలో అనేక చారిత్రక ఆధారాలు బయటకు వచ్చాయని తెలిపారు. విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక మ్యూజియం లేదని, చారిత్రక వారసత్వ సంపదకు భద్రపరిచే నిలయంగా రుషికొండ ప్యాలెస్‌ను మార్చాలని తెలిపారు.

మహారాజశ్రీ యలమంచిలి సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
హెచ్.యమ్.ఒ.పి.నెం.40 (2024)

బిట్వీన్...
రాయి వెంకటలక్ష్మి, భర్త రవికుమార్, కేరాఫ్ రావి జానకిరామ్, భావనారుషి గుడివద్ద, ధర్మవరం వీధి, యలమంచిలి మున్సిపాలిటీ, అనకాపల్లి జిల్లా, **...పిటిషనర్**
మరియు
రాయి రవికుమార్, తండ్రి అప్పారావు, యస్.యఫ్.యస్. చర్చి(ఆపోజిట్), చినవాల్తేరు, విశాఖపట్నం టౌను, విశాఖ పట్నం జిల్లా
...రెస్పాండెంటు

జనరల్ నోటీసు

పై నెంబరు పిటిషనులో రెస్పాండెంటుకు పలు పర్యాయములు కోర్టువారు పర్సనల్‌గా మరియు రిజిష్టరు పోస్టుద్వారా నోటీసులు పంపించిననూ సదరు రెస్పాండెంటుకి పర్సనల్‌గా సర్వీస్ కావడం లేదు. సదరు కారణంగా పై పిటిషనరు సబ్‌స్టిట్యూట్ సర్వీసు కొరకు వేసుకున్న పిటిషనుపై శ్రీ కోర్టువారు ఈ పేపరు పబ్లికేషను ద్వారా పై రెస్పాండెంటు కు జనరల్ నోటీసునకు ఆర్డరు వేసియున్నారు. సదరు రెస్పాండెంటుకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న పై కోర్టువారి ఎదుట **తేదీ.06.01.2025 న ఉదయం 10.30 గం.లకు** హాజరై తమయొక్క ఆక్షేపణలు ఏమైనా తమరుగానీ, తమ వకీలు ద్వారా గానీ తెలియచేయ వలెను. లేనియెడల పైపిటిషను మీకు పరోక్షముగా తీర్మానం చేయడమగును.

తేది. **యస్.వి.ఎ.ప్రసాదు,**
09.12.2024 అడ్వకేటు, కోర్టు కాంప్లెక్సు,
యలమంచిలి, విశాఖజిల్లా, 7893802452

ముగిసిన అఖిల భారత రవాణా సంస్థల క్రీడా పోటీలు

విజేతలకు బహుమతులు అందిస్తున్న డిజిపి ద్వారకాతిరుమలరావు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖలోని కైలాసగిరి ఎఆర్ పోలీసు గ్రౌండ్‌లో మూడు రోజుల పాటు నిర్వహించిన అఖిల భారత రవాణా సంస్థల క్రీడాపోటీలు ఆదివారం ముగిశాయి. స్నేహపూర్వక వాతావరణంలో జరిగిన జాతీయ స్థాయి ఆర్‌టిసి క్రీడా పోటీల ముగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేక అతిథిగా వచ్చిన రాష్ట్ర డిజిపి, ఎపిఎస్‌ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్, ఎస్‌ఆర్‌టియు వైస్ ప్రెసిడెంట్ సి.హెచ్.ద్వారకాతిరుమలరావుకు ఎపిఎస్‌ఆర్‌టిసి చైర్మన్ కొనకళ్ల నారాయణ స్వాగతం పలికారు. విధి నిర్వహణలో ఎంతో బిజీగా ఉండే ఆర్‌టిసి ఉద్యోగుల్లో మానసిక ఉల్లాసం కలిగించేందుకు, వారిలో స్నేహ భావం పెంచేందుకు, ప్రతిభను బయటకు తీసేందుకు ఈ క్రీడా పోటీలు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వానికి, ద్వారకా తిరుమలరావుకు కొనకళ్ల నారాయణ ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా డిజిపి ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ, ఆర్‌టిసి చరిత్రలో ఎప్పుడూ జరగనంతగా, ఎవ్వరూ మరిచిపోలేనంతగా ఈ వేడుకలు జరగడం చాలా సంతోషంగా ఉందన్నారు. పతకాలు సాధించడం కంటే క్రీడల పట్ల మీరు చూపించిన అంకితభావం నిజంగా హర్షించదగినదన్నారు. సంస్థ చైర్మన్ కొనకళ్ల నారాయణ, డిజిపి ద్వారకా తిరుమలరావు చేతుల మీదుగా విజేతలకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌ఆర్‌టిసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) జివి.రవివర్మ, విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.విజయకుమార్, విజయనగరం జోనల్ చైర్మన్ దొన్నుదొర, ఎఎస్‌ఆర్‌టియు డైరెక్టర్ ఆర్‌ఆర్‌కె.కిశోర్‌కుమార్, విజయవాడ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి.విజయరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎపిఎస్‌ఆర్‌టిసికి 15 పతకాలు..

ఈ క్రీడా పోటీల్లో ఎపిఎస్‌ఆర్‌టిసికి మొత్తం 15 పతకాలు సాధించగా వాటిలో 5 గోల్డ్, 3 సిల్వర్, 7 బ్రాంజ్ పతకాలు ఉన్నాయి. మొత్తం పతకాలవేటలో కర్నాటక ఆర్‌టిసి విన్నర్‌గా నిలవగా, బెంగళూరు మెట్రో పాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ రన్నర్‌గా, ఎపిఎస్‌ఆర్‌టిసి సెకెండ్ రన్నర్‌గా నిలిచాయి. మహిళల వెయ్యి మీటర్ల రేస్ వాక్‌లో ఎపిఎస్‌ఆర్‌టిసి ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకోవడం విశేషం.

చెస్ ఛాంపియన్ మద్రాస్

యూనివర్శిటీ ఆఫ్ మద్రాస్ టీమ్‌కు ట్రోఫీని అందిస్తున్న గీతం ఇన్‌ఛార్జి వీసీ గౌతమరావు

ప్రజాశక్తి-మధురవాడ : భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఎఐయు) సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ మహిళల చెస్ ఛాంపియన్‌షిప్‌ను యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ గెలుచుకుంది. సౌత్ జోన్ పరిధిలోని 5 రాష్ట్రాలకు చెందిన అంతర్ విశ్వవిద్యాలయాల మధ్య మహిళల చదరంగం పోటీల్లో విజేత అయిన యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ టీమ్‌కు గీతం ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు ఆదివారం ట్రోఫీని అందజేశారు. అన్నా యూనివర్శిటీ రెండో స్థానంలో, భారతీయార్ యూనివర్శిటీ మూడో స్థానంలో, ఎస్ఆర్ఎం యూనివర్శిటీ నాలుగో స్థానంలో నిలిచాయి. గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డాక్టర్ యు.విజయకుమార్, గీతం విద్యార్థి విభాగం డీన్ ప్రొఫెసర్ బాలాకుమార్, గీతం క్రీడా విభాగం మేనేజర్ రితేష్ సిన్హా వివిధ క్రీడా విభాగాలకు చెందిన కమిటీ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో జిఎం వైశాలి రమేష్ బాబును డైరెక్టరేట్ ఆఫ్ స్పోర్ట్స్ సత్కరించింది.

గోతులు పడిన తాతయ్య గారి కల్లాల రోడ్డు

అధ్వానంగా రోడ్డు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం బంటుపల్లి వారి కల్లాలు పంచాయతీ పరిధిలోని తాతయ్య గారి కల్లాలు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ కల్లాల రోడ్డులో సుమారు 50 కుటుంబాలు ప్రయాణాలు సాగిస్తుంటారు. వర్షాలు కురిస్తే రోడ్డు బురద మయమై నడవలేని పరిస్థితి నెలకొంది. ద్విచక్రవాహనాలు అదుపుతప్పి పడి పోయి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ గ్రామపంచాయతీలో పలు ప్రాంతాలలో రోడ్లు కూడా సక్రమంగా లేని పరిస్థితి నెలకొంది. గత వైసిపి ప్రభుత్వంలో అనేకసార్లు రోడ్డు ఏర్పాటుకు కాలనీవాసులు దరఖాస్తులు చేసుకున్నా పనులు మాత్రం చేయలేదని గ్రామానికి చెందిన కోణితుల సంతోష్ తదితరులు వాపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా నిధులు కేటాయించి రోడ్డు ఏర్పాటుచేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

గిరిజన సమ్మేళనంలో సాంస్కృతిక ప్రదర్శనలు

సాంస్కృతిక ప్రదర్శనలిస్తున్న గిరిజన యువత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో రెండవ రోజు సాంస్కృతిక ప్రదర్శనలతో మారుమోగిపోయింది. గీతం విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యాన జరుగుతున్న 16వ జాతీయ గిరిజన యువ సమ్మేళనంలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల గిరిజన విద్యార్థులు ఇచ్చిన ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. ఉదయం యోగాతో మొదలైన కార్యక్రమంలో జాతి నిర్మాణంలో దేశ భక్తి అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటుచేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లా అధికారి గొర్లె మహేశ్వరరావు ఆధ్వర్యాన జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌వికె శ్రీకాకుళం జిల్లా అధికారి కె.వెంకట్ ఉజ్వల్, ఎఒ పృధ్వీ, అల్లం రాంప్రసాద్, ప్రసన్న, శ్వేత, జేమ్స్, జ్ఞానదీప్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో నృత్యప్రదర్శనలిస్తున్న చిన్నారులు

అలరించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి -మధురవాడ : శిల్పారామం జాతరలో ఆదివారం నిర్వహించు వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. సరస్వతి నృత్య కళామందిరం సింహాచలం వారిచే శాస్త్రీయ, జానపద నృత్యాలు ప్రదర్శిచారు. మూషిక వాహన, గిరిధర గోపాల, బ్రహ్మ కడిగిన పాదము, అదివో అల్లదివో ముద్దుగారే యశోద, వేణు గానం, ఒకపరి ఒకపరి తదితర గేయాలకు చిన్నారులు భువన, హిరణ్య, ఊర్మి భవిష్య, వైష్ణవి, జయశ్రీ సహ్య, సహిత, జోష్ణ, హర్షిణి, శోభిత, దివ్య, దేశిత, దీక్షితలు నృత్యం చేశారు. ఈ కార్యక్రమాన్ని పరిపాలన అధికారి టి.విశ్వనాథ్‌రెడ్డి పర్యవేక్షించారు.

నేరాలు ఘోరాలు

బెల్లం పులుపును ధ్వంసం చేస్తున్న పోలీసులు

300 లీటర్ల సారా పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-గొలుగొండ: ముందస్తు సమాచారం మేరకు గొలుగొండ మండలం చోద్యం గ్రామ శివారులో బొడ్డేరు గెడ్డ వద్ద సారా తయారీ స్థావరాలపై దాడులు చేపట్టినట్లు కృష్ణదేవిపేట ఎస్సై వై.తారకేశ్వరరావు తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీకి నిల్వ ఉంచిన 300 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామన్నారు. నాటుసారా తయారు చేసినా, విక్రయించినా చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు. ఈ దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

మూడు టన్నుల బియ్యం పట్టివేత

ప్రజాశక్తి -గాజువాక : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని గాజువాక పోలీసులు అరెస్టు చేశారు. మల్కాపురానికి చెందిన పూసర్ల అచ్చిబాబు జింక్ గేటు నుంచి బిహెచ్‌పివి జంక్షన్‌కు బొలెరో వాహనం ద్వారా మూడు టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా గాజువాక పోలీసుల మింది గ్రామం వద్ద పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకొని, అచ్చిబాబుపై కేసు నమోదు చేశారు.

మోహనరావు మాస్టారుకు 'లైఫ్ టైమ్ అచీవ్ మెంట్' అవార్డు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి ఎంవిడి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న తగరపువలస కొండపేటకు చెందిన డాక్టర్ గంటాన మోహనరావుకు 'జీవిత సాఫల్య పురస్కారం-2024' (లైఫ్ టైమ్ అచీవ్ మెంట్) అవార్డు లభించింది. విద్య, సామాజిక పరంగా ఎంతో కాలంగా అతను అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. హైదారాబాద్‌కు చెందిన 'ద సి కనెక్ట్స్" జాతీయ సంస్థ విశాఖ నగరంలో శనివారం రాత్రి 'గ్రోత్ స్టోరీస్ సమ్మిట్ అండ్ అవా ర్డ్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. అవార్డు అందుకున్న మోహనరావు మాస్టారును పలువురు ఉపాధ్యాయులు, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ప్రతినిధులు అభినందించి హర్షం వెలిబుచ్చారు.

ఐక్య పోరాటాలతో హక్కుల సాధన

ప్రజాశక్తి -తగరపువలస : ఐక్య పోరాటాల ద్వారానే హక్కులను సాధించుకోగలమని చిట్టివలస జ్యూట్ మిల్లు పించనుదారుల సంఘం నాయకులు పిలుపునిచ్చారు. చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో ఆదివారం జ్యూట్ మిల్లు పించనుదారుల సంఘం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం నాయకులు కానూరు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ, నాయకులు సింగిడి అప్పారావు మాట్లాడుతూ, పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను పరిగణనలోకి తీసుకొని కనీస పింఛను రూ 5 వేలు ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 17వ తేదీన పించనుదారులు నిరసన తెలపనున్నట్లు వివరించారు. సంఘం నాయకులు ఎం.అప్పలరాజు పాల్గొన్నారు. అనంతరం సంఘం నూతన కార్య వర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కానూరు రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా దామోదర బాబాజీ, కోశాధికారిగా పంపాన సూర్య నారాయణ, సహాయ కార్యదర్శిగా ఎం.అప్పలరాజు, 9 మంది కార్యవర్గ సభ్యులతో కార్యవర్గం ఎన్నికైనట్లు నాయకులు తెలిపారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

ప్రజాశక్తి -ఉక్కునగరం : దేశపాత్రునిపాలెం సమీపంలోని పోర్టికో కాలనీలో సీసీ కెమెరాలను పరవాడ సిఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మల్లికార్జునరావు మాట్లాడుతూ, ముందు జాగ్రత్తగా సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకోవడం మంచిదన్నారు. అవకాశముంటే ప్రతి ఇంటికీ వ్యక్తిగతంగా పెట్టుకోవడం మంచిదన్నారు. ఎల్‌హెచ్ఎంఎస్ గురించి వివరించారు. కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు మధుసూదన్, కార్యదర్శి శ్రీనివాసులు, సుమ, సత్యనారాయణ, ప్రసాదరావు, శ్రీనివాసరావు, రామలింగేశ్వర, కాశీ ప్రసాద్, సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

బహుమతులను అందుకున్న విజేతలతో ఎం.వెంకటేశ్వరరావు, గాజువాక సిఎంఆర్ టీం లీడర్

'సమైక్య'లో సిఎంఆర్ ఆటల పోటీలు

ప్రజాశక్తి -గాజువాక : సిఎంఆర్ జ్యూయలరీ గాజువాక బ్రాంచి ఆధ్వర్యాన ఆదివారం తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్ పోటీల్లో అపార్ట్‌మెంట్ మహిళలు, చిన్నపిల్లలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో నలుగురికి బహుమతులను అందజేశారు. లక్కీ డ్రిప్ ద్వారా మరో ముగ్గురికి బహుమతులను అందజేశారు. మహిళలకు సిఎంఆర్ మహిళా సిబ్బంది మెహేందీని పెట్టారు. అనంతరం విజేతలకు అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ఎ.తవిటయ్య, సిఎంఆర్ గాజువాక యూనిట్ టీం లీడర్ మల్లేశ్వరరావు ఆధ్వర్యాన బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు తౌడన్న, శ్రీనివాసరాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉక్కు డిజిఎం కె.వేణుగోపాల్ దంపతులను సన్మానిస్తున్ననిర్వాహకులు

తెలంగాణ ఉద్యోగుల ఆత్మీయ సందడి

ప్రజాశక్తి -ఉక్కునగరం : తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉక్కునగరంలోని స్వర్ణ జయంతి పార్కులో ఆత్మీయ సందడి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు, పురుషులు, పిల్లలు ఆట, పాటలతో సందడి చేశారు. ఉక్కు జనరల్ మేనేజర్ ఎన్.వీరేశం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యాన ఇటువంటి కార్యక్రమాలు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు. సంఘం అధ్యక్షులు ఎన్.కుమారస్వామి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి జి.ఆనంద్, ప్రతినిధులు బి.వెంకటేశ్వర్లు, టి.ప్రభాకర్, ఎన్.నర్సింగరావు, జె.శ్రవణ్‌కుమార్, సిహెచ్.రవికుమార్, ఎం.చంద్రశేఖర్, మోతుకూరి వేణుగోపాల్, జి.మల్లేశం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేస్తున్న ఉక్కు డిజిఎం కె.వేణుగోపాల్ దంపతులను సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

సమైక్య అపార్ట్‌మెంట్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అసోసియేషన్ నాయకులు

సమైక్య అపార్ట్‌మెంట్‌లో అంబేద్కర్ వర్ధంతి

ప్రజాశక్తి- గాజువాక : తోకాడ సమైక్య అపార్ట్‌మెంట్‌లో సమైక్య అపార్ట్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యాన అంబేద్కర్ వర్ధంతిని నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎం.తవిటయ్య, ఉపాధ్యక్షులు తౌడన్న, అసోసియేషన్ సభ్యులు సాగర్, గౌరవ వరాన్, దయాసాగర్, శంకరరావు పాల్గొన్నారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాక సీనియర్ క్రికెటర్స్ అసోసియేషన్ మూడో వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం జింక్ మైదానంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ క్రికెట్‌కు ప్రాతినిధ్యం వహించిన వివేక్, వేణు గోపాల్, నితీష్ కుమార్, శ్రీకాంత్ వంటి ఉద్దండులు జింక్ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడారని గుర్తు చేశారు. వారందరి స్ఫూర్తితో స్థానిక యువత దేశ క్రికెట్‌లో రాణించాలని ఆకాంక్షించారు. గాజువాకలో క్రికెట్ అకాడమీ కోసం స్థలాన్ని కేటాయించే విధంగా తాను కృషి చేస్తానన్నారు. క్రీడలు, క్రీడా పరికరాలకు తమ ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. వైసిపి గాజువాక నియోజకవర్గం ఇన్చార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, యువత క్రీడలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును అసోసియేషన్ సభ్యులు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి నూకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టిడిపి గాజువాక ఇన్చార్జ్ ప్రసాదుల శ్రీనివాసరావు, జివిఎంసి ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు, జనసేన గాజువాక ఇన్చార్జ్ గంధం వెంకటరావు, అసోసియేషన్ కార్యదర్శి రాజారావు, సిపి రెడ్డి, కోచ్ గాంధీ, కసిరెడ్డి రమణ, అచ్యుతరావు, గంధం నగేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఎస్.రమణ

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికుల సమస్యలు పరిష్కారం కాకపోతే ఈ నెల 12వ తేదీ తర్వాత ఏరోజైనా సమ్మెకు వెళతామని విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి ఎస్.రమణ హెచ్చరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఆదివారమూ కొనసాగాయి. ఈ దీక్షలనుద్దేశించి మాట్లాడుతూ, కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.21 వేలు చెల్లించాలని, ఐదేళ్ల సర్వీసు ఉన్న కాంట్రాక్టు కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలని, ఎనిమిది గంటల పని దినంతో పాటు, ఓటీని, స్త్రీలకు ప్రసూతి సెలవులు అమలు చేయాలని, కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, పని ప్రదేశాల్లో విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ కాంట్రాక్టు లేబర్ యూనియన్ నాయకులు పిల్లా భాస్కరరావు, దాడి నాగ మరణిబాబు, నాయుడు, చిన్నమ్మలు, మంగ పాల్గొన్నారు.

రక్తదానానికి యువత ముందుకు రావాలి

ప్రజాశక్తి-పెందుర్తి : రక్తదానానికి యువత ముందుకు రావాలని డాక్టర్ రాము పిలుపునిచ్చారు. జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్‌లోని సురభి క్లినిక్ ఆధ్వర్యాన రక్తదాన శిబిరం, ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. విజయశ్రీ బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. అనంతరం ఉచిత వైద్య శిబిరంలో రోగులను డాక్టర్ జివిఎస్.రాము, జి.లక్ష్మీమాధవి ఉచితంగా పరీక్షించి మందులు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాము మాట్లాడుతూ, రక్తదానం వల్ల మరొకరి ప్రాణాన్ని కాపాడగలుగుతామన్నారు. ప్రతి ఆరు నెలలు దాటిన తర్వాత ఒకసారి రక్తదానం చేస్తే ఆరోగ్యానికి మంచిదని తెలిపారు. ట్రిబుల్ ఎస్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎం.సన్యాసిరావు సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో తార్కాశరావు, జి.సన్యాసిరావు, పి.ఈశ్వరరావు, కె.అఖిల్, సాయిప్రకాష్ సురభి క్లినిక్, విజయ శ్రీ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పోరాటం మరింత ఉధృతం

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన పోరాటం మరింత ఉధృతం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం నాటికి 1396వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సిఐటియుకు చెందిన వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకుడు నమ్మి రమణ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ వ్యతిరేక ఉద్యమం దేశవ్యాప్తంగా ఎంతో మందికి స్ఫూర్తి కలిగించిందన్నారు. పోస్టు కార్డుల ఉద్యమం సైతం 10 లక్షలకు చేరువకానుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు కెఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరాజు, వివి.రమణ, సూర్యకుమార్, అప్పారావు పాల్గొన్నారు.

దీక్షలో కూర్చున్న సిఐటియు నాయకులు

'ఆదర్స్'లో నేడు బహుముఖ పోటీలు

ప్రజాశక్తి-పెందుర్తి: ఆదర్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9 నుంచి 14వ తేదీ వరకు వివిధ కరిక్యులర్, కోకరిక్యులర్ యాక్టివిటీలో కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు ఆదర్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఫ్లోరా తెలిపారు. ఈ కాంపిటేషన్లలో ప్రతి ఇంటర్ విద్యార్థి భాగస్వామ్యం కావాలని కళాశాల కరస్పాండెంట్ టి.థియోఫిలస్ కోరారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని టాలెంట్‌ను నిరూపించు కోవాలని సూచించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు, సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. జెన్‌జిల్- 2024 పేరుతో నిర్వహించే ఈ పోటీల్లో సోలో సింగింగ్, గ్రూప్ డ్యాన్స్, క్విజ్, ఎలక్యూషన్, వాలీబాల్, చెస్, క్యారమ్స్, స్కిట్, బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్, డ్రాయింగ్ పోటీలు ఉంటాయని తెలిపారు. ఇంటర్ విద్యార్థులు స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని, ఎంట్రీ ఫ్రీ అని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి-సీతమ్మధార : యువత మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని ఐఎఆర్ఎఫ్ ఛైర్మన్ నరవ ప్రకాశరావు సూచించారు. బివి.ఫౌండేషన్ ఫర్ పీస్ అండ్ హార్మోనీ, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ రిలీజియస్ ఫ్రీడమ్ (ఐఎఆర్ఎఫ్) సంస్థల ఆధ్వర్యాన ఆదివారం మానవ హక్కుల దినోత్సవ ప్రత్యేక సమావేశం డాక్టర్ ఎల్‌బి.కాలేజీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ, ఏటా డిసెంబర్ 10న ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుతుందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని తెలిపారు. ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ మాట్లాడుతూ, మానవ హక్కుల పరిరక్షణకు పూర్తిస్థాయిలో చట్టబద్ధత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్యులు పద్మయ్య, డాక్టర్ కెవిఎస్ఎన్.మూర్తి, మున్నార్, హాస్రగోపాల్, బ్రహ్మకుమారి, రామేశ్వరి, అనిత సూర్యనారాయణ పాల్గొన్నారు.

లయన్స్ కేన్సర్ ఆసుపత్రికి విరాళం

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న లయన్స్ కేన్సర్, జనరల్ ఆసుపత్రికి ఎయు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ రిటైర్డ్ ఉపాధ్యాయ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూ.1,06,232 విరాళం అందించారు.

కుమారి కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : ఎస్ రాయవరం మండలం కుర్రపోలు ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికురాలు ఏడిద కుమారి (40) శుక్రవారం పాఠశాలలో మరుగుదొడ్లను శుభ్రం చేస్తున్న క్రమంలో అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందారని, కుమారి కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయ సహకారాలు అందించి ఆదుకోవాలని ఏపి పాఠశాల, కళాశాల శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.శివలక్ష్మి, పి.జానకి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశంలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శివలక్ష్మి, జానకి సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి. శ్రీనివాసరావు మాట్లాడారు. శానిటేషన్ కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం, ప్రమాదవశాత్తు మృతి చెందిన కార్మికులకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో అకాల మర ణాలు సంభవిస్తే ఆ కుటుంబం రోడ్డున పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే శానిటేషన్ కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. వేతన బకాయి చెల్లింపుతోపాటు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా, ఐడెంటిటీ కార్డులు, యూనిఫామ్ వంటి సౌకర్యాలు ప్రభుత్వం వెంటనే కల్పించాలని కోరారు కార్యక్రమంలో శానిటేషన్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి, లక్ష్మి, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివలక్ష్మి

స్వయం ఉపాధిపై యువత దృష్టి పెట్టాలి

ఎమ్మెల్యే సుందరపును సత్కరిస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : స్వయంఉపాధి అవకాశాలపై యువత దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం అచ్చుతాపురంలో అరుణాచల డిజిటల్స్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకొని ఉపాధి లేక ఖాళీగా ఉండకుండా ఉపాధి అవకాశాలపై దృష్టిసారించాలన్నారు. యువత స్వయంశక్తితో రాణించాలని, యువ పారిశ్రామికవేత్తలుగా రాణించడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. అరుణాచల డిజిటల్స్ నిర్వాహకులను అభినందించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపును సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పి మాజీ చైర్‌పర్సన్ లాలం భవాని భాస్కర్, జనసేన నాయకులు లాలం చందు, సుందరపు రవికుమార్, లాలూ ప్రసాద్, రాజన్న అప్పారావు పాల్గొన్నారు.

గవరల సంక్షేమానికి కృషి

సురేంద్రను సత్కరిస్తున్న గౌరీయులు

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలోని సత్యనారాయణపురంలోని సత్యనారాయణ స్వామి దేవస్థానం వద్ద బిఆర్‌టి కాలనీ గౌరీ సంఘం ఆధ్వర్యంలో గవర ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. రాష్ట్ర గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర పాల్గొని, ముందుగా గౌరీమాతకు పూజ చేశారు. ఈ సందర్భంగా సురేంద్ర మాట్లాడుతూ ఏటా గౌరీసంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం, చదువులో, ఉద్యోగంలో ప్రతిభ చూపిన వారిని సత్కరించడం అభినందనీయ మన్నారు. గవర కులస్తులకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. బిఆర్‌టి కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి ఆర్థికంగా ఉన్న వాళ్ళంతా సహకరించాలని, తన వంతుగా రూ.25 వేల విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ భీశెట్టి వరాహ సత్యవతి, అనకాపల్లి గౌరీ సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, గవర కార్పొరేషన్ డైరెక్టర్లు విల్లూరి హరి, బొడ్డేడ శ్రీను, మళ్ల సురేష్, మళ్ల శ్రీనివాస్, మొల్లేటి శివాజీ, బుద్ద సోమేశ్వర రావు ,ఎల్లపు వెంకట్రావు, నాగేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

రబీలో ఉద్యానవన పంటలకు బీమా

- 15లోగా ప్రీమియం చెల్లిస్తేనే మామిడిపంటకు బీమా

ప్రజాశక్తి- దేవరాపల్లి : రబీ సీజన్‌లో ఉద్యానవన పంటలకు 2024-25 ఏడాదికి గాను పిఎంఎఫ్‌బివై ద్వారా బీమా పొందవచ్చునని ఉద్యానవన శాఖ అధికారిణి ఆర్.కిరణ్మయి అన్నారు. ఆదివారం రైతులతో కలిసి మామిడి తోటలను పరిశీలించారు. మామిడి పంటలపై నష్టం ఎక్కువగా ఉందని, బీమా చేయించుకుంటే ఆర్థికంగా భరోసా ఉంటుందని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా అనే సంస్థ రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల సహకారంతో కాలానుగుణంగా వాతావరణంలో వచ్చే ప్రతికూల మార్పులతో పంట నష్టం జరిగితే ఆర్థిక నష్టాల నుండి రైతులను ఆదుకునేందుకు ఈ పంటల బీమా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో మామిడి పంటకు ఈ నెల 15లోగా ప్రీమియం చెల్లించాలని రైతులకు సూచించారు.. ఎకరాకు రూ.2200 ప్రీమియం చెల్లిస్తే, పంటనష్టపోతే, రూ.44వేలు వరకు బీమా వర్తిస్తుందన్నారు. బీమా చెల్లించే రైతులు బ్యాంక్ అకౌంట్ జిరాక్స్, ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, పంట వేసినట్టు ధ్రువీకరణ పత్రం జిరాక్సులు ఉండాలన్నారు. బీమా పొందుటకు దగ్గరలో ఉన్న బ్యాంకు లేదా సిఎస్‌సి(కామన్ సర్వీస్ సెంటర్), మీసేవ, డెమో కంపెనీ ద్వారా నియమింపబడిన మధ్యవర్తులు, ఎస్‌ఒవిఐ ఇన్సూరెన్స్ బుకింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్, www.pmfby.gov.in, లేదా మొబైల్ ద్వారా కూడా బీమా పొందవచ్చునని సూచించారు. ప్రీమియం చెల్లించి బీమా చేయించుకుంటే ఈ ఏడాది డిసెంబర్ 15 నుంచి వచ్చే ఏడాది మే 31వరకు పంట బీమా వర్తిస్తుందన్నారు. అధిక వర్షపాతం, గాలిలో తేమశాతం, వాతావరణ వ్యత్యాసం అధిక గాలి వేగం వల్ల సంభవించిన, పరిణామాలను మండల స్థాయిలోరాష్ట్ర డెవలప్మెంట్ ప్లానింగ్ సొసైటీ వాతావరణ పరికరాల సమయంలో లెక్కించి, ఈ పథకంలో ముందుగా పొందుపరచబడిన పరిణామాలలో సరిపోల్చి వచ్చిన తేడా ఆధారంగా నష్టపరిహారం రైతులకు చెల్లిస్తారన్నారు.

మామిడితోటలను పరిశీలిస్తున్న హార్టికల్చర్ అధికారి కిరణ్మయి

ఉత్తమ వాకర్స్ క్లబ్‌గా తుమ్మపాల

సత్యనారాయణను సత్కరిస్తున్న వాకర్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : వాకర్స్ ఇంటర్నేషనల్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 101 జిల్లా సమావేశం ఆదివారం గౌరీ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ ఏడాది ఉత్తమ వాకర్స్ క్లబ్‌గా తుమ్మపాల ఎన్నికయింది. ఆరు నెలలోనే రెండు ఉచిత నేత్ర శిబిరాలు, వైద్య అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మపాల వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఎరుబండి సత్యనారాయణకు వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ మురళీ మనోహర్, డిస్ట్రిక్ట్ గవర్నర్ టి రంగారావు సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు సుంకర రవీంద్ర, డాక్టర్ డిడి నాయుడు పాల్గొన్నారు.

పలుచోట్ల పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కొండకర్ల ఆవలో బోట్ షికారులో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : 34ఏళ్ల తర్వాత చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థులు ఆదివారం కొండకర్ల ఆవలో కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు కౌగిలించుకొని ఆత్మీయతంగా పలకరించుకున్నారు. పరస్పర క్షేమసమాచారాలను తెలుసుకుని ఆనందంగా గడిపారు. సమ్మేళనానికి రాని స్నేహితుల గురించి ఆరా తీశారు. కష్టాల్లో ఉన్న స్నేహితులకు, వారి కుటుంబీకులకు సహాయ సహకారాలు అందించాలని నిర్ణయించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ఆవలో బోట్ షికారు చేశారు. ఆటలో పాటలతో హుషారుగా గడిపారు.

సబ్బవరం : రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సూర్య మెడికల్, జనరల్ స్టోర్ అధినేత బాదిరెడ్డి లక్ష్మణ ఆధ్వర్యంలో దేవిపురంలో ఆదివారం జరిగింది. పూర్వ విద్యార్థులంతా కుశల ప్రశ్నలు వేసుకుని, నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమ ఉపాధ్యాయుల గొప్పతనాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. ఏటా కలుసుకోవాలని నిర్ణయించారు. సహపంక్తి భోజనాలు చేశారు. రోజంతా సందడిగా గడిపారు. కార్యక్రమంలో అప్పటి స్కూల్ లీడర్ శ్రీను, బాదిరెడ్డి లక్ష్మణ, సత్యనారాయణ, కనకరాజు, సమత, లక్ష్మి పాల్గొన్నారు.

మునగపాక: స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో 1995-96 బ్యాచ్ పదవ తరగతిపూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. 28 తర్వాత కలుసుకున్నా, అలనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఇటీవల తాము చదువుకున్న పాఠశాలకు రూ.2.20లక్షలతో వేదికను సమకూర్చిన పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఎలమంచిలి : 1983 బ్యాచ్ టెన్త్, ఇంటర్ బ్యాచ్ పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పిక్నిక్ ఆదివారం షణ్ముఖ గార్డెన్స్ సాయి గారి తోటలో జరిగింది. పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఆడారి రమణబాబు, గౌరవాధ్యక్షులు శెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు రేఖావాసు, ప్రధాన కార్యదర్శి వి.ఆనంద్, కార్యదర్శి సూరిశెట్టి సూర్య కోశాధికారి షేక్ గౌస్, వర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థి, జిల్లా జడ్జి పుసా శ్రీనివాసును సత్కరించారు. కార్యక్రమంలో మళ్ల రమణ, వనం బాలు, ఆడారి భాస్కరరావు, సూర్యశ్రీ, పద్మ, ఉత్తరకుమారి, సత్యవేణి, శ్రీదేవి పాల్గొన్నారు. ఆత్మీయ సమ్మేళనానికి, పిక్నిక్‌కు అయ్యే ఖర్చు భరించిన శెలంశెట్టి నాగేషును అందరూ అభినందించారు.

దేవరాపల్లి : తెనుగుపూడి అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2001బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులంతా ఆదివారం ఆత్మీయంగా కలుసుకున్నారు. 23ఏళ్ల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు చదువు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా గురుకుల విద్యాలయాల కోఆర్డినేటర్ ఎస్. రూపవతి పాల్గొన్నారు.

యలమంచిలిలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

గౌరీపరమేశ్వరుల సన్నిధిలో సాయికృష్ణ

గౌరీ పరమేశ్వరులను దర్శించుకుంటున్న సాయికృష్ణ

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని చూచుకొండ గ్రామంలో గౌరీ పరమేశ్వరుల మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ గౌరీ పరమేశ్వరులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆయనను స్వాగతించి, పూజల అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీనివాస్, చూచుకొండ తెలుగుదేశం పార్టీ నాయకులు కాండ్రేగుల శంకర్, బొడ్డేడ చిన్న, బొడ్డు నర్సింగరావు, కోటిబాబు, శ్రీరామ్మూర్తి, అప్పలనాయుడు, రమేష్, కళ్యాణ్, రాము, విల్లూరి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాల ఒప్పందాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి :ప్రజలపై వేసే విద్యుత్ భారాల ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని వార్వా నివాస్ కన్వీనర్ బి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం వార్వ నివాస్, అనకాపల్లి జోన్-7 ఆధ్వర్యంలోపార్క్ సెంటర్ సమీపంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. తేలయ్య బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో 25 మంది వక్తలు పాల్గొని, అదాని అక్రమ విద్యుత్ ఒప్పందాలు, వాటివల్ల ప్రజలపై భారాలను రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చించారు. సమావేశంలో వార్వానివాస్ కన్వీనర్ బి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల యూనిట్‌ను 49 పైసలు అదనంగా కొనుగోలు చేసి ప్రజలకు పంపిణీ చేస్తున్నారని, దీనివల్ల ప్రజలపై విపరీతంగా భారాలు పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న తేలయ్య బాబు

గత ప్రభుత్వం విద్యుత్ ధరలు పెంచితే ఆందోళన చేసిన కూటమి ప్రభుత్వం, ఇప్పుడు అదే భారాలు వేయడం దుర్మార్గమన్నారు. పెంటకోట శ్రీనివాసరావు, శివరామకృష్ణ, బొడ్డేడ వెంకట అప్పారావు మాట్లాడుతూ,. ఆదానీ కంపెనీకి సోలార్ విద్యుత్ ఉత్పత్తిపై ప్రభుత్వాలు రాయితీలు ఇచ్చాయని. ఆదానీ కంపెనీ ఈ ఒప్పందాలను చూపించి అమెరికాలో ఉన్న కంపెనీల నుంచి పెట్టుబడులు సేకరించిందన్నారు. ఈ వ్యవహారంలో అవినీతి జరిగిందని అమెరికా కంపెనీ కేసు నమోదు చేయగా, అందులో రాష్ట్రంలో గత ప్రభుత్వానికి భాగం ఉందన్నారు. ఆదానీ కంపెనీతో జరిగిన ఒప్పందాలను రద్దు చేయాలని తద్వారా ప్రజలపై పడిన చార్జీల భారాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల పేరుతో పేదలపై మరింత భారాన్ని మోపవద్దని కోరారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం నిర్ణయించింది.

405 మందికి కంటి పరీక్షలు

బ్రాండిక్స్‌లో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి -అచ్యుతాపురం : బ్రాండిక్స్‌లో ఆదివారం నిర్వహించిన 133వ ఉచిత కంటి వైద్యశిబిరంలో 405 మందికి ఉచితంగా కంటిపరీక్షలు చేశారు. 90 మంది రోగులకు మందులు పంపిణీ చేశారు. 45 మంది కంటి రోగులకు కేటరాక్ట్ ఆపరేషన్ చేయడానికి ఎంపిక చేశారు. శిబిరానికి వచ్చిన కంటి రోగులకు మజ్జిగ ఫలహారాలు భోజనం సదుపాయం ఏర్పాటు చేశారు. బ్రాండిక్స్ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి వైద్య శిబిర నిర్వహిస్తున్నట్లు బ్రాండిక్స్ ఇండియా అపెల్ సిటీ పార్టనర్ దొరస్వామి తెలిపారు.

రైతు కూలీసంఘం
రాష్ట్ర మహాసభల సావనీర్ ఆవిష్కరణ

సావనీర్ ఆవిష్కరిస్తున్నఅతిథులు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక నర్సింగరావు పేట ఎపిటిఎఫ్ భవనంలో ఆదివారం రైతుకూలీ సంఘం(ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర మహాసభల సావనీర్-2024ను సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు అధ్యక్షతన సీనియర్ న్యాయవాది పిల్లా హర్షశ్రీనివాసరావు ఆవిష్కరించారు. వక్తలుగా కవి, అధ్యాపకులు టి.పృథ్వీరాజ్, జనసాహితి జిల్లా అధ్యక్షులు ఐటిఆర్‌వి శివాజీరావు మాట్లాడుతూ, సావనీర్‌లో పొందుపరిచిన అనేక వ్యాసాలు,మహాసభల్లో మాట్లాడిన అంశాలు నేటి వ్యవసాయ సంక్షోభానికి, ప్రభుత్వాల కార్పొరేట్ అనుకూల విధానాలు, ఎలా తోడ్పడుతున్నాయో తెలియజేస్తున్నాయన్నారు.

మహాసభల్లో 'సామ్రాజ్యవాదుల కబంధహస్తాల నుండి వ్యవసాయ రంగాన్ని పరిరక్షించుకుందాం' అనే నినాదానికి నేటికీ ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. సభలో కనీస మద్దతు ధర చట్టం కోసం, నాలుగేళ్ల క్రితం ఢిల్లీ రైతు పోరాటంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, ఢిల్లీ సరిహద్దులోని పోరాడుతున్న రైతుల పై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అణచివేత చర్యలను సభ ఖండించింది. రైతుకూలీసంఘం జిల్లా కమిటీ సభ్యులు పైలా రమేష్, గొర్లి రాజు, బర్ల అప్పలనాయుడు, మరిశా సతీష్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడికి వితరణ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ లగుడువారి ఇంటివద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి అంతరాలయం గ్రానైట్ ఫ్లోరింగ్‌కు వికెపిసిపిఐఆర్ యుడిఎ మాజీ చైర్మన్ చొక్కాకుల వెంకటరావు తనవంతుగా రూ.రెండు లక్షల ఆర్థికసాయం అందించారు. ముందుగా ఆలయ కలశ ప్రతిష్ట, సుబ్రహ్మణ్యషష్టి పూజలు, అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి చొక్కాకుల గోవింద, సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, వెలమ సెంట్రల్ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బండారు రామకృష్ణ, బయలుపూడి రమణ పాల్గొన్నారు.

శివాలయ నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-సబ్బవరం : మండల కేంద్రంలో శివాలయ నిర్మాణానికి సబ్బవరం గ్రామానికి చెందిన ఎస్‌వి నారాయణ (చంటి పంతులు) రూ.10,116 విరాళాన్ని ఆదివారం ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఈ సందర్భంగా చంటి పంతులకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో బర్ల రమణ, గెడ్డం కృష్ణ, దంగేటి నాని, దంగేటి ప్రకాష్, చింతల శ్రీను, పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థులకు
ఇంటర్‌తోపాటే నీట్, ఐఐటి శిక్షణ

ప్రజాశక్తి- దేవరాపల్లి : సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యార్థులకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ ఫస్టియర్ నుంచే ఇంటర్తో పాటు ఐఐటి, నీట్ కోచింగ్ ప్రారంభించడానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని ఉమ్మడి విశాఖ జిల్లా సమన్వయ అధికారి ఎస్.రూపవతి తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కార్యదర్శి వి.ప్రసన్న వెంకటేష్ సుముఖత వ్యక్తం చేశారన్నారు. ఆదివారం తెనుగుపూడి బాలుర గురుకుల విద్యాలయంలో విలేకరులతో మాట్లాడారు.

రూపవతి

వచ్చే విద్యా సంవత్సరంలో తమ విద్యా సంస్థల్లో ఇంటర్ చేరడానికి దరఖాస్తు చేసుకున్న వారికి ఐఐటి, నీట్ ప్రవేశ పరీక్షకు సంబంధిన రాష్ట్ర స్థాయి ప్రతిభా పరీక్ష నిర్వహిస్తామన్నారు. వారిలో మెరిట్ సాధించిన విద్యార్థుల్ని ఎంపిక చేస్తామన్నారు. అలా ఎంపికైన వారిలో ఉత్తరాంధ్రాకు చెందిన బాలురకు విశాఖ నగరంలోని శ్రీకృష్ణాపురం గురుకుల కళాశాలలో సీట్లు కేటాయిస్తామన్నారు. అదే విధంగా బాలికలకు చీపురుపల్లి బాలికల విద్యాలయంలో సీట్లు ఇస్తామన్నారు. వారికి ఇంటర్ చదువుతో పాటు ఐఐటి, నీట్ ప్రవేశ పరీక్ష రాయడానికి అవసరమైన ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు.. పది, ఇంటర్ పరీక్షల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించేందుకు విద్యార్థులకు ప్రతీ వారం ప్రత్యేక మైక్రో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. వెనుకబడిన విద్యార్థుల్ని గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ నిస్తున్నామన్నారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం, రాత్రి ఒక్కొక్క గంట చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 11 సాంఘిక సంక్షేమ గురుకులాల్లో వంట సామగ్రితో పాటు కూరగాయలు వగైరా సామాన్లు సరఫరా చేస్తున్న వారికి ఆరు నెలల బకాయిలు వారం రోజుల్లోగా విడుదలయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలో శిథిలావస్థలో ఉన్న తెనుగుపూడి, గొలుగొండ, నక్కపల్లి, సిఇఒ (విశాఖ), శ్రీకృష్ణాపురం, మేహాద్రిగెడ్డ గురుకులాల్లో భవనాల మరమ్మత్తులకు ఒక్కొక్క పాఠశాలకు రూ. కోటి 20 లక్షలు మంజూరయ్యాయన్నారు. మైనర్లు రిపేర్లు చెయ్యాల్సిన తాళ్లపాలెం, కొక్కిరాపల్లి, సబ్బవరం పాఠశాలల భవనాల మరమ్మత్తులకు ఒక్కొక్క దానికి రూ. 30 లక్షలకు పైబడి వ్యయం అవుతుందని ఎపిఇడబ్ల్యుఐడిసి అధికారులు అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారన్నారు. తమ గురుకులాల్లో చదువుతున్న బాల, బాలికలు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తూ జాతీయ స్థాయికి ఎదుగడం ఎంతో గర్వకారణమని రూపవతి అన్నారు.

వీఆర్ఓల సంఘం నూతన కార్యవర్గం

తహశీల్దార్‌కు కార్యవర్గ వివరాలను ఇస్తున్న వీఆర్ఓలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండల వీఆర్ఓల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా మలునాయుడుపాలెం వీఆర్ఓ టి.శేఖరరావు ఉపాధ్యక్షుడిగా ఆరిపాక వీఆర్ఓ బి.అప్పలరాజు, కార్యదర్శిగా కె.అనంత్ (నారపాడు), సహాయ కార్యదర్శిగా కె.రుక్మిణి (అంతకాపల్లి), కోశాధికారిగా కె.వాత్సల్యరామ్, కార్యవర్గ సభ్యులుగా పి.జగన్నాథరావు, ఎస్.దేముడుబాబు, డి.ఈశ్వరరావు, ఎం.గోవిందరావును ఎన్నుకున్నారు. అనంతరం తహసీల్దార్ బి.చిన్నికృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి కార్యవర్గం ఎన్నిక పత్రాన్ని అందించారు. వారికి తహసీల్దార్ శుభాకాంక్షలు తెలిపారు.

పలుచోట్ల గీతా జయంతి

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని తోటాడ గ్రామంలో ఆదినారాయణ స్వామి రాజయోగాశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం గీతా జయంతి నిర్వహించారు. మేనేజింగ్ ట్రస్టీ సూరిశెట్టి సుషుమ్నకుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల్లో భగవద్గీత పట్ల ఆసక్తిని పెంపొందించడం కోసం ట్రస్ట్ చేస్తున్న కృషి ప్రశంసనీయమని కొనియాడారు. పాల్గొన్న చిన్నారులందరికీ పెన్నులను అందజేశారు. కార్యక్రమంలో వెంకటాచలం, గెడ్డం సూర్యనారాయణ, చంద్రశేఖర రాజు, నూకలక్ష్మీ నారాయణ, రమణ, దేశెట్టి లక్ష్మణ, హేము, కిషోర్, మురళి, శంకర్, భాస్కర్, భూషణ్ పాల్గొన్నారు.

చోడవరం :ఈనెల 11న గీతా జయంతిని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ప్రేమ సమాజంలో జూనియర్ సీనియర్ విభాగాల్లో భగవద్గీత పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీపురం పాఠశాల హెచ్ఎం ఎవి.జగన్నాథరావు, ప్రేమ సమాజం నిర్వాహకులు రాజు, రిటైర్డ్ లెక్చరర్ ఎన్.దేముడు, ఉపాధ్యాయులు రామయ్యరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- సబ్బవరం.: మండలంలోని సబ్బవరం మేజర్ పంచాయతీ జోడుగుళ్లలో బంగారమ్మ, కుంచాలమ్మ మంచాలమ్మ అమ్మవార్ల ఆలయాల పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. స్థానిక సిఐ పిన్నింటి రమణ, సబ్బవరం-2 ఎంపిటిసి బైలపూడి దేముడుబాబు, పలువురు మండల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బంగారు తల్లి సేవా సమితి అధ్యక్షుడు సింగంపల్లి వెంకటరావు, సభ్యులు సింగంపల్లి స్వామినాయుడు, ముర్రె కనకరాజు, చిత్రాడ శ్రీనివాసరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి- అనకాపల్లి : నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) 2024 పరీక్షకు 3,682 మంది హాజరైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అనకాపల్లి జిల్లాలో రెండు డివిజన్లో 16 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించినట్లు తెలిపారు. రెండు తనిఖీ బృందాలు ఆయా పరీక్ష కేంద్రాలను సందర్శించాయన్నారు. జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల్లో తగిన మౌలిక వసతులు, బందోబస్తు ఏర్పాట్లు చేసామన్నారు.

రెవెన్యూ సదస్సుల షెడ్యూల్

ప్రజాశక్తి-సబ్బవరం :భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రెవెన్యూ సదస్సులను మండలంలో ఈనెల 9నుంచి వచ్చేనెల 8 వరకు నిర్వహించనున్నట్లు తహశీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఈనెల 9న అయ్యన్నపాలెం, 10న వంగలి, 11న ఎల్లుప్పి, బోదువలస, 12న రాయపురంఅగ్రహారం, 13న బంగారమ్మపాలెం, అడ్డూరు సిరసపల్లి, 16న నంగినారపాడు,17న టెక్కలిపాలెం, 18న అంతకాపల్లి, 19న అజనగిరి, 20న గంగవరం, 21న నల్లరేగులపాలెం, నారపాడు, 23న బాట జంగాలపాలెం, 24న వెదుళ్లనరవ, 26న అమృతపురం, 27న గొల్లలపాలెం, విప్పాక అగ్రహారం, 28న చింతగట్ల అగ్రహారం, గుల్లేపల్లి, 30న మొగలిపురం, 31న లగిశెట్టిపాలెం, 2న ఆరిపాక, 3న ఆసకపల్లి, ఎరుకునాయుడు, 4న గొట్టివాడ, గాలిభీమవరం, 6న పైడివాడ, ఇరువాడ, 7న సబ్బవరం, సబ్బవరం అగ్రహారం, 8న పైడివాడ అగ్రహారం గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి, ప్రజా సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

నేడు లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట పంచాయతీలో సోమవారం లేగదూడల ప్రదర్శన నిర్వహించనున్నట్లు, మండల పశువైద్యాధికారిణి డాక్టర్ కెహెచ్‌పి మంజుషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. లేగదూడల ప్రదర్శనలో రైతులంతా తమ దూడలను తీసుకువచ్చి, వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఫెర్టిలైజర్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు. అవకాశాన్ని పాడి రైతుల సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు

వికలాంగులను ఆదరించాలి

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని బయ్యవరం గ్రామంలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఆదర్శ పాఠశాల వద్ద ఆదివారం వికలాంగుల దినోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది డూమా అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ రోజారాణి మాట్లాడుతూ, వికలాంగులు ఎవరికి తీసిపోరన్నారు. విజయానికి వైకల్యం అడ్డంకి కాదనారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌టి జిల్లా కోఆర్డినేటర్ శకుంతల, డిసిసిబి మేనేజర్ దుర్గాప్రసాద్, ఎంఇఒలు సూర్యనారాయణ మూర్తి, అంధ ఉపాధ్యాయులు కొర్రపోలు వెంకటేశ్వరరావు, విశ్వభారతి ప్రిన్సిపాల్ గొన్నాబత్తుల నానాజీ, ఆదర్శ పాఠశాల కరస్పాండెంట్ దేవర చిరంజీవి పాల్గొన్నారు.

ముందుకు సాగని గృహ నిర్మాణాలు

-జగనన్న కాలనీల్లో సౌకర్యాలు కరువు
-కూటమి ప్రభుత్వంపై లబ్ధిదారుల ఆశలు

ప్రజాశక్తి -కోటవురట్ల: **గత ప్రభుత్వ పాలనలో పేదల ఇళ్ల నిర్మాణాలకు కేటాయించిన జగనన్న లే అవుట్లపై బీడులుగా దర్శన మిస్తున్నాయి. మండలంలోని అన్నవరం గ్రామంలో కొనుగోలు చేసిన లేఅవుట్ ఇందుకు నిదర్శంగా నిలుస్తుంది. ఊళ్ళు కడుతున్నామని ఊదరకుట్టిన నాటి ప్రభుత్వం, అధికారులు బీళ్ళుగా వదిలేసారు. కనీసం నడవడానికి అవకాశం లేని ఎక్కడో మారుమూల కొండ ప్రాంతంలో లేఅవుట్ కేటాయించడంతో నేటికీ ప్రస్తుతం అక్కడికి వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఇక్కడ కేటాయించిన ఒకే ఒక్క లేఅవుట్ అది కూడా నివాసయోగ్యం కాక పోవడంతో గ్రామస్తులు పలు విధాలుగా ఆనాడు మొరపెట్టుకొని విసిగి వేసారి పోయారు.**

జల్లూరు గ్రామంలో కొనుగోలు చేసి ఏర్పాటు చేసిన లేఅవుట్‌కు రహదారి సౌకర్యం లేదు.అదేవిధంగా రామచంద్రపాలెంలో ఏర్పాటు చేసిన లేఅవుట్ రామచంద్రపాలెం, బికే పల్లి గ్రామాలకు ఏర్పాటు చేశారు. అది కూడా కొండ ప్రాంతంలో ఏర్పాటు చేయడం, గ్రామానికి దూరంగా ఉండడంతో నడిచి వెళ్ళలేని కారణంగా ప్రస్తుతం బీడును తలపిస్తుంది. పందూరు గ్రామానికి సంబంధించి నాటి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన లే అవుట్ కూడా కొండ ప్రాంతం కావడంతో ఇక్కడ కూడా నిర్మాణాలు చేపట్టేందుకు గ్రామస్తులు తిరస్కరించడంతో వృథాగా దర్శనమిస్తుంది. ఆక్సహెబ్ పేట గ్రామ దుస్థితి మరీ విడ్డూరం. ఇక్కడ తొలుత కొండ ప్రాంతంలోనే ఒక లేఅవుట్ ఎంపిక చేశారు. అక్కడ నిర్మాణాలు చేపట్టేందుకు గ్రామస్తులు తిరస్కరించడంతో వేరొక చోట లేఅవుట్ ఏర్పాటు చేశారు. అక్కడ కూడా ప్రస్తుతం గ్రామానికి దూరంగా ఉండటంతో లబ్ధిదారులు తిరస్కరిస్తున్నారు.అదే విధంగా పాత తంగేడు గ్రామంలో ఏర్పాటు చేసిన లేఔట్ కూడా కొత్త తంగేడు గ్రామస్తులను ఎంపిక చేశారు.అది కూడా గ్రామానికి దూరంగా ఉండటంతో లబ్ధిదారులు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాలేదు.

కొండ ప్రాంతంలో ఉన్న అన్నవరం లే అవుట్

రాజుపేటలో లే అవుట్

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన లేఅవుట్ స్థల వివాదం కారణంగా నిలిచి పోయింది. ఈ స్థలం ప్రభుత్వ కళాశాలది అంటూ స్థానికులు కోర్టుకు వెళ్లడంతో ఏర్పాటు చేసిన లేఅవుట్ వృథాగా దర్శనమిస్తోంది. ఎండపల్లి వద్ద ఏర్పాటు చేసిన లేఔట్ కొండ ప్రాంతం కావడంతో అక్కడ కూడా లబ్ధిదారులు తిరస్కరిస్తున్నారు. నీలిగుంట గ్రామానికి కేటాయించిన స్థలం కూడా గ్రామానికి దూరంగా ఉండడంతో ఇక్కడ కూడా తిరస్కరిస్తున్నారు. రాజుపేటలో కూడా కొండప్రాంతంలో లే అవుట్లు కేటాయించడంతో నిర్మాణాలకు ముందుకు రాలేదు.

ఊర్లు కడతామని ఊదర కొట్టింది నాటి ప్రభుత్వం, నేడు అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కూడా సదరు లేఅవుట్లపై ఇంతవరకూ ఎటువంటి పురోగతి చేయ లేక పోవడంతో లబ్ధిదారులు దిక్కులు చూస్తున్నారు. నూతన కూటమి ప్రభుత్వం స్పందించి ఇళ్ల నిర్మాణాలకు సౌకర్యాలు కల్పించాలని ఆయా ప్రాంతాల లబ్ధిదారులు కోరుతున్నారు.

అక్సాహెబ్ పేటలో తుప్పల్లో ఉన్న విద్యుత్ స్తంభాలు

అన్నదాతకు చినుకు భయం

-అల్పపీడనంతో రైతుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి -నక్కపల్లి: అల్పపీడనంతో రైతులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తుంది. వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో అన్నదాత ఆందోళనతో కొట్టుమిట్టాడు తున్నారు. చివరి గింజలు చేతికందే సమయంలో రైతులకు చినుకు భయం పట్టుకుంది.

ఇటీవల ఫెంగల్ తుఫాన్ రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. ఇప్పుడు మరో అల్పపీడన గండం ఉండడంతో రైతుల గుండెల్లో గుబులు పట్టుకుంది.

మండలంలో ఖరీఫ్ సీజన్ కు సంబంధించి మునుపెన్నడూ లేని విధంగా 4400 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. ఈ ఏడాది వరి ఆశాజనకంగా ఉంది. ఉపమాక, జానకయ్యపేట, నక్కపల్లి, చినదొడ్డిగల్లు, కాగిత, ఉద్దండపురం, గొడిచెర్ల, ఒడ్డిమెట్ట, డొంకాడ, జి జగన్నాథపురం, ముకుంద రాజుపేట తదితర గ్రామాల్లో వరి కోత దశకు దశకు చేరుకుంది. ఇప్పటికే పలుచోట్ల రైతులు కోతలు ప్రారంభించారు. వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో అన్నదాతకు చినుకు భయం పట్టుకుంది. కోత దశకు చేరుకున్న వరి చేతికి అందుతుందో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధిక పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టి వరి పంటను పండించారు. పలువురు రైతులు అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టారు. ఈ దశలో వర్షం కురిసినట్లయితే అన్నదాతకు తీవ్ర నష్టం జరుగుతుంది.

వరి సాగు ఆశాజనకంగా ఉండటంతో పెట్టుబడుల భారం నుండి బయటపడతామన్న ఆశతో రైతులు ఉన్నారు. ఇటువంటి నేపథ్యంలో తుఫాన్ హెచ్చరికలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇటీవల ఫెంగల్ తుఫాన్ ప్రభావంగా కురిసిన వర్షం, ఈదురు గాలులకు అక్కడక్కడ వరి నేల కొరిగింది. దీంతో ఆయా రైతులకు నష్టం చేకూరిన విషయం తెలిసిందే.

కోత దశకు చేరుకున్న వరి

ఒకేచోట్ల కలిసిన పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి- ఎస్.రాయవరం:ఎన్నో ఏళ్ల తర్వాత పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. ఎక్కడో స్థిరపడిన వారంతా ఆత్మీయంగా కలుసుకున్నారు. 1988-89 విద్యా సంవత్సరంలో కొరుప్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయికను ఏర్పాటు చేశారు. ఒకరి నొకరు పరిచయం చేసుకున్న వారంతా ఆనందంగా గడిపారు.ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబాలలో పిల్లలకు తమవంతు సహాయ సహకారాలు అందించేందుకు నిర్ణయించుకున్నారు. తమ ఉన్నతికి పునాదులు వేసిన పాఠశాల అబివృద్ధికి ఇతోధికంగా సహాయపడేందుకు నిర్ణయించుకున్నారు.

సభ్యత్వాన్ని ఇస్తున్న మాజీ సర్పంచ్ అప్పలనాయుడు

టిడిపి సభ్యత్వాల నమోదు

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట:ప్రతి కార్యకర్త టిడిపి సభ్యత్వాన్ని కలిగి ఉండాలని సర్పంచ్ సుంకర లక్ష్మి, మాజీ సర్పంచ్ డోంకిన అప్పలనాయుడులు తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం రాత్రి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టిడిపి సభ్యత్వం కార్యకర్తలకు భరోసా అని తెలిపారు. సభ్యత్వం కలిగిన కార్యకర్త ఎటువంటి ప్రమాదాలకు లోనైనా పార్టీ భరోసా కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమం లో పూడి రామారావు, గాడి ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి: మండలంలో పలు గ్రామాల్లోనూ చురుగ్గా టిడిపి సభ్యత్వాలు నమోదవుతున్నాయని తెలుగుదేశం పార్టీ మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. నక్కపల్లిలో రాజీవ్ నగర్ కాలనీలో ఆదివారం వెంకటేష్ ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వాలు నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ టౌన్ ప్రెసిడెంట్ అడ్డూరి లోవరాజు, అడ్డూరి శ్రీను, నాయకులు కొప్పిశెట్టి వీరబాబు, దేవరపు లోవరాజు, నడిగట్ల అప్పన్న, అడ్డూరి చిన్న, ధర్మయ్య పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-అరకులోయ రూరల్:అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకువేలి మండలం సుంకరమెట్ట పంచాయతీ దండబాడు నుండి లింబాగుడ వరకు రెండు కిలోమీటర్ల డబ్ల్యూబిఎమ్ రోడ్డు పనులకు సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెల చిన్నబాబు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. గతంలో రెండు సార్లు ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేసినా పనులు పూర్తి కాలేదు. ఈ సంధర్భంగా సర్పంచ్ చిన్నబాబు మాట్లాడుతూ, ఈ రోడ్డు దండబాడు నుండి లింబగుడా వరకు రెండు కిలోమీటర్లు రోడ్డు పూర్తి చేసినట్లయితే ఈ రెండు గ్రామాల ప్రజాలకే కాకుండా హుకుంపేట మండలం బూర్జ పంచాయతీ ప్రజలకు కుడా ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.తక్కువ కిలో మీటర్లలోనే అన్ని గ్రామాలకు అనుసంధానం చేసే ఈ రోడ్డును గుత్తేదారులు గతంలో చేసినట్టు శంకుస్థాపన వరకు పరిమితం చేయకుండా సకాలంలో పనులు పూర్తి చేసి రవాణా సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.రాజు, కేశవ్, బాబురావు, వార్డు మెంబర్ దేవన్న, రాము పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

గోతులతో రహదారి అస్తవ్యస్తం

గోతులుగా ఉన్న రహదారి

ప్రజాశక్తి -కోటవురట్ల:మండలంలో అన్నవరం గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా చిద్రమైంది. దీంతో గడిచిన దశాబ్ద కాలంగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంక్రాంతి నాటికి కూటమి ప్రభుత్వం గుంతలు లేని రహదారులు ఏర్పాటు చేస్తామని ప్రకటనలు చేసింది. అయితే ఇంతవరకు గ్రామానికి ఎటువంటి నిధులు కేటాయించక పోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రాత్రి సమయంలో ద్విచక్ర వాహనాలు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి, గత ప్రభుత్వంలో అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే నాథుడే లేడని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలోనైనా రహదారి మంజూరు చేస్తారని అంతా ఆశగా ఎదురు చూశారు. ఈ రోడ్డుపై వేములపూడి వెళ్లేందుకు దగ్గర దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. అధికారులు, నాయకులు స్పందించి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బాక్సింగ్ టీమ్ కోచ్‌గా అబ్బు

కోచ్ అబ్బు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:న్యూ ఢిల్లీలో జరుగనున్న నేషనల్ స్కూల్ గేమ్స్ అండర్ 17 బాక్సింగ్ టోర్నమెంట్ కు ఆంధ్రప్రదేశ్ టీమ్ కోచ్‌గా శాప్ కోచ్ అబ్బుని ఎంపిక చేసినట్లు ద్రోణాచర్య గ్రహీత కోచ్ ఐ. వేంకటేశ్వరావు తెలియజేశారు. ఈనెల 9నుండి 15 వరకు న్యూ ఢిల్లీలో ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ఆటలకు స్థానిక శాప్ కోచ్ అబ్బు ఎంపిక అయ్యారు. ఇందులో భాగంగా ఆయనను నర్సీపట్నం నింజాస్ అకాడమీ, నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్స్ చైర్మన్ వెలగా నారాయణరావు అభినందిచారు. నర్సీపట్నంకు చెందిన ఎంతో మందిని నేషనల్, ఇంటర్నేషనల్ బాక్సర్లు తయారు చేసిన ఘనత అబ్బు దేనని పలువురు కొనియాడారు.

అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

అసంపూర్తిగా పంచాయతీ కార్యాలయ భవనం

ప్రజాశక్తి- కోటవురట్ల: మండలంలో కొడవటిపూడి గ్రామంలో ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్యాలయం భవనం కోసం దాదాపు పది లక్షలు మంజూరు చేసింది. ఈ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తోంది. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సచివాలయ వ్యవస్థతో కొత్త భవనం మంజూరు కావడంతో పాత భవనాన్ని అలా అసంపూర్తిగా వదిలేశారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి అసంపూర్తిగా ఉన్న భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

సంచరిస్తున్న శునకాలు

గ్రామాల్లో శునకాల స్వైర విహారం

ప్రజాశక్తి- బుచ్చయ్యపేట: మండలంలో పలు గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. చిన్నారులపై సైతం దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. మండలంలోని వడ్డాది, బంగారు మెట్ట, దిబ్బిడి, బుచ్చయ్యపేట, కందిపూడి, రాజాం, సీతయ్యపేట తదితర గ్రామాల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో గ్రామాల్లో ప్రజలు భయ భ్రాంతులకు గురవుతున్నారు. ఒకవైపు మనుషులపై దాడి చేయడమే కాకుండా ఆవు దూడలు, లేగ దూడల పై దాడులు చేస్తున్నాయి.గత వారం రోజుల క్రితం చిన్నప్పనపాలెం గ్రామానికి చెందిన ఒక రైతుకు చెందిన ఆవు దూడను కరిచి చంపాయి. పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి.చికెన్ షాపుల వేదికగా గుంపులుగా తిరుగుతున్నాయి. గత కొంతకాలంగా పట్టణ ప్రాంతాలకే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో సైతం చికెన్ దుకాణాలు విరివిగా వెలిసాయి. చికెన్ వ్యర్థాలను కొంతమంది వ్యాపారులు బహిరంగంగా వేసి విడిచిపెట్టడంతో చికెన్ వ్యర్థాలకు అలవాటు పడిన కుక్కలు పశువుల పై దాడులకు పాల్పడుతున్నాయి. గ్రామస్థాయి అధికారులు వీధి కుక్కల నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

మాట్లాడుతున్న వెంకటరమణ

ప్రజాశక్తి-రావికమతం:సమస్యలను పరిష్కరించాలని రావికమతం మండల ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నేతలు డిమాండ్ చేశారు. రావికమతం మండలం ఫీల్డ్ అసిస్టెంట్ల గౌరవాధ్యక్షులు దాసరి వరహాలు, మండల సంఘం అధ్యక్షుడు మచ్చ వెంకటరమణ (శ్రీను), కార్యదర్శి శెట్టి రాజకుమారిలు మాట్లాడుతూ, రావికమతం మండలంలో ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సిబ్బంది 28 పంచాయతీలలోనూ 26 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పని చేస్తున్నారన్నారు. వీరిలో 2008 వ సంవత్సరంలో నియామకమైన వారు సుమారు 20 మంది పనిచేస్తున్నారన్నారు. ఏన్నో ఏళ్లుగా ఇదే ఉద్యోగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నామన్నారు. కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పిఎఫ్, ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ యూనియన్ అధ్యక్షులు గణేష్, మాజీ మండల కార్యదర్శి శ్రీను, నూకరాజు, సన్నిబాబు, తదితరులు ఉన్నారు.

నర్సింగ్ కాలేజీకి 83 పోస్టులు మంజూరు

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్:కెజిహెచ్ ఆవరణలో నిర్వహించబడుతున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజీకి కొత్త పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఏళ్ల నాటి పెండింగ్ ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.త్వరగా పోస్టులు భర్తీ చేయాలని జివోలో ఆదేశించారు. టీచింగ్ స్టాఫ్, కార్యాలయ పరిపాలనాధికారి, ఆఫీసు సూపరిండింటెంట్లను పదోన్నతి క్రమంలో భర్తీ చేయనుండగా, హౌస్ కీపింగ్ గ్రేడ్-1, లైబ్రెరియన్, సీనియర్ అసిస్టెంట్లను కాంట్రాక్ట్ పద్దతిలో భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగిలిన కార్యాలయ సిబ్బంది, ఇతర 16 క్యాడర్ పోస్టులను అవుట్సోర్సింగ్ విధానంలో భర్తీ చేయనున్నారు. ఈ నియామక ప్రక్రియంతా డిఎంఈ ఆధ్వర్యంలో చేసేలా అన్ని చర్యలు తీసుకున్నారు. ఈ తాజాగా పోస్టుల భర్తీతో చాలా కాలంగా ఖాళీల భర్తీకి మోక్షం లభించనుంది. ఈ పోస్టులన్ని ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్ ఆదేశాలను పాటిస్తూ నియామకాలు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. త్వరలోనే ఈ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ చేసి, వాటిని త్వరితగతిన నియామకాలు చేసేలా అధికారులు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మక నగరంగా పేరొందిన విశాఖలోని నర్సింగ్ కాలేజీలో అన్ని క్యాడర్ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలపడంతో వైద్యవర్గాల్లో పెండింగ్ లోని పోస్టులకు పూర్తిస్థాయిలో భర్తీ జరగనుంది.రాష్ట్ర ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి జివో 143 జారీ చేశారు. దీనిలో భాగంగా ఉన్నతాధికారి నుంచి దిగువ స్థాయి ఉద్యోగి వరకూ సుమారు 83 మంది పోస్టులను భర్తీ చేయనున్నారు. వీటిలో 27 టీచింగ్ పోస్టులతో పాటు 56 నాన్ టీచింగ్ పోస్టులు ఉన్నాయి. అధిక శాతం అన్ని పోస్టులు పదోన్నతితో భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎఇ పోస్టులు భర్తీ చేయాలి

ఆంధ్ర ప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ ఇపి డిస్కం యూనిట్ అధ్యక్షులు కె.సత్యప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:ఎఈ పోస్టులను జెఈలతో పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని ఆంధ్ర ప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఈపి డిస్కం యూనిట్ అధ్యక్షులు కె.సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. డైమండ్ పార్కు సమీపంలోని ఓ హొటల్‌లో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన సభాధ్యక్షత వహించి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా కొత్త ఎఈ పోస్టులను తూర్పు ప్రారంత విద్యుత్ పంపిణీ సంస్థ భర్తీ చేయడం లేదని ఆరోపించారు. జెఈ, ఎఈలతో పాటు అదనపు పోస్టుల భర్తీ విషయంలో యాజమాన్యం కావాలనే జాప్యం చేయడం వల్ల ఉద్యోగులపై తీవ్ర పని భారం పడుతోందన్నారు. సమస్యల పరిష్కారానికి తగిన కార్యచరణ చేయాల్సి ఉందని అందుకు ఉద్యోగులంతా ఏక తాటిపైకి వచ్చి సమస్యల పరిష్కారానికి పోరాట పటిమను చూపాలన్నారు.క్షేత్ర స్థాయిలో పని చేసేందుకు అవసరమైన వాహనాలు, సామగ్రి,మౌళిక వసతుల కల్పనకు యాజమాన్యం సహకరించాలని కోరారు. ఎఈ,జెఈల జీత భత్యాల విషయంలో భారీ తేడాలున్నాయని వాటిని సరి చేయాల్సిన్నారు. డిస్కం నూతన కార్యదర్శి జి.జోగి నాయుడు మాట్లాడుతూ క్షేత్ర స్థాయి పోస్టుల భర్తీ విషయంలో యాజమాన్యం చేస్తున్న జాప్యంతో ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, దీంతో వినియోగదారులకు, అటు యాజమాన్యానికి పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతు న్నామన్నారు.

రాష్ట్ర అధ్యక్షులు వి.వి మహేశ్వరరెడ్డి, రాష్ట్ర సలహాదారు ఎ. సుబ్బారావు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.సన్యాసిరావు తదితరులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో జరుగుతున్న అన్ని విషయాలను ఇంజనీర్లకు వివరించారు. అంతా కలసికట్టుగా సమర్థవంతంగా పని చేసి సంఘ మనుగడను కాపాడుతూ విద్యుత్ సంస్థకు కూడా మంచి పేరు తేవాలని ఆకాక్షించారు.

అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ ఈపి డిస్కం మేనేజింగ్ కమిటీ అధ్యక్షునిగా కె.సత్య ప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శిగా జి. జోగినాయుడు, మరి కొంతమంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

వృథాగా దర్శనమిస్తున్న జలశుద్ధి యంత్రం

వృథాగా జల శుద్ధి యంత్రం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వంలో విద్యార్థులకు సురక్షిత తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన జలశుద్ధి యంత్రం ప్రస్తుతం వృథాగా పడి ఉంది. గత ఏడాది నుండి ఈ యంత్రం వృథాగా పడి ఉండడంతో విద్యార్థులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఇదే విషయం పట్ల సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులను వివరణ కోరగా అధికారులకు తెలియజేశామని త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామ న్నారు. పాఠశాల విద్యాశాఖ కమిటీ అధ్యక్షులు చొరవ చూపి వినియోగంలోకి తీసుకురావాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రశాంతంగా జాతీయ ఉపకార వేతన పరీక్ష

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:2024-25 విద్యా సంవత్సరమునకు సంబంధించి జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్) ఆదివారం ఉదయం 10 గంటలు నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగింది. విశాఖపట్నం జిల్లాలో 11 కేంద్రములలో జరిగిన ఈ పరీక్షకు హాజరు కావలసిన 2184 మంది అభ్యర్థుల్లో 2034 మంది హాజరు కాగా 150 మంది పరీక్షకు హాజరు కాలేదని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ మీడియాకు తెలిపారు.పరీక్ష ప్రశాంతంగా జరిగిందన్నారు.

ఆలయానికి రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో ఎం. కోడూరు గ్రామంలో మోదకొండమ్మ అమ్మవారి ముందు భాగం రహదారి పక్కన పాదముల నిర్మాణానికి జాజిమొగ్గల అప్పారావు సత్యవతి, సంజీవి మీనాక్షి దంపతులు శనివారం 10 వేలు. నగదు విరాళం అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ చైర్మన్, ఎం కోడూరు గ్రామ సర్పంచ్ గొల్లవిల్లి సంజీవరావు.కు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు శాస్త్రి పడాల అప్పల నాయుడు, చింతా వెంకట నారాయణమూర్తి, జగదీష్, గోపాల్, జొన్నపల్లి నాగరాజు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-అరకులోయ:పర్యాటక కేంద్రమైన అరకులోయకు ఆదివారం పర్యాటకులు వేలాదిగా తరలివచ్చారు. దీంతో ఈ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలు పర్యాటకులతో కిటకిటలాడాయి. .ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో అరకులోయ ప్రాంతంలోని సందర్శిత ప్రాంతాలైన గిరిజన మ్యూజియం, ఉద్యానవన కేంద్రం, కాఫీ మ్యూజియం వంటి సందర్శిత ప్రాంతాలు కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో పర్యాటకులు తరలి రావడంతో అరకులోయ టౌన్ షిప్‌లో సందడి నెలకొంది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయి ట్రాఫిక్ జామ్ ఏర్పడ్డాయి. పోలీసులు ప్రధాన కూడలిలో విధులు నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు క్లియర్ చేయడంతో ప్రయాణికులు, పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు.

డుంబ్రిగుడ:ప్రముఖ పర్యాటన కేంద్రమైన మండలంలోని చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో మైదాన ప్రాంతం నుంచి పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకుల తాకిడితో చాపరాయి జలపాతం కిటకిటలాడింది గిరిజన సాంప్రదాయమైన దింసా నృత్య కళాకారులతో పర్యాటకులు నందంగా గడిపారు.

చాపరాయిలో సందడి చేస్తున్న పర్యాటకులు